teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 03 | సంచిక : 228 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 19 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## నేడు ప్రారంభంకానున్న హైదరాబాద్ బుక్‌ఫెయిర్

**350 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం**

**కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రులు జూపల్లి, పొన్నం**




హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఎప్పుడెప్పుడా అని పుస్తక ప్రియులంతా ఎదురుచూస్తున్న 'హైదరాబాద్ బుక్‌ఫెయిర్' నేటి నుంచి షురూ కానుంది. ఎన్టీఆర్‌స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ హాజరై ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. పదిరోజుల పాటు జరిగే ఈ పండుగలో 350 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ తెలుగు భాషతో పాటు ఇతర భాషలు, ఇంటర్నేషనల్‌పబ్లికేషన్లకు సంబంధించిన పుస్తకాలు కూడా దొరుకుతాయి. పది రోజుల పాటు జరిగే ఈ బుక్‌ఫెయిర్‌ను లక్షల మంది విజిట్ చేసే అవకాశం ఉంది.




# విడుదలైన టెట్ పరీక్షల షెడ్యూల్

**జనవరి 2 నుంచి 20 వరకు రెండు సెషన్లలో పరీక్షలు**

**2.75 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు టెట్ కన్వీనర్ వెల్లడి**

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) పరీక్షల సంబంధించి షెడ్యూల్ విడుదలయ్యింది. జనవరి 2 నుంచి 20 వరకు ప్రతిరోజు రెండు సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ తెలిపారు. ఉదయం 9.00 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్ ఉంటుంది. మధ్యాహ్నం 2.00 నుంచి 4.30 గంటల వరకు రెండవ సెషన్ ఉంటుంది. ఈ సారి టెట్ కు సుమారు 2.75 లక్షల

మిగతా 2 లో

# శాసన సభలో ప్రవేశపెట్టనున్న భూ భారతి బిల్లు

**భూభారతి చట్టం ప్రకారం ప్రతి రైతుకూ భూధార్**



- ఇకపై ప్రతి ఏటా జమాబందీ
- ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యం
- ఆర్‌వోఆర్ చట్టం-2020ని పూర్తిగా ప్రక్షాళన
- ధరణిని సాగనంపామ్.. భారతిని ప్రవేశపెడుతున్నాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యంగా భూభారతి బిల్లును ప్రవేశపెడుతున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణి పోర్టల్‌లో లక్షల సమస్యలు వచ్చాయని అన్నారు. ధరణి పోర్టల్ తో వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని, గ్రామాల్లో

మిగతా 2 లో







# గురుకులాల్లోని దారుణాలకు ఇది మరో నిదర్శనం

**సర్వేల్ పాఠశాల ఘటనపై స్పందించిన హరీష్ రావు**

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో వంటవాళ్లకు బదులుగా విద్యార్థులను వంటపనికి వినియోగించడంతో ఓ విద్యార్థి ఒంటిపై వేడి నూనె పడిన విషయం

మిగతా 2 లో



## ఈ నెల 28న ఆవిష్కృతంకానున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈ నెల 28న ఆవిష్కరించనున్నారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పాటు మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారు. దాదాపు రూ.430 కోట్ల వ్యయంతో రైల్వేశాఖ అభివృద్ధి చేసింది. ఈ స్టేషన్‌లో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టులు, ఆరు బుకింగ్ కౌంటర్లు

మిగతా 2 లో



# పాఠశాలల సమస్యలపై శాసన సభలో మాటల యుద్ధం

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై స్వల్పకాలిక చర్చలో శాసన సభలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ కు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కు మధ్య మాటాల యుద్ధం సాగింది. ప్రభుత్వం వైపు నుంచి సీతక్క

మిగతా 2 లో

# టీపీసీసీ చీఫ్ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం

**కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు**

**రోడ్డుపై అదానీ, మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా నినాదాలు**






# వన్ నేషన్ వన్ ఎలక్షన్ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ

**లోక్‌సభ నుంచి 21, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు**

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): వన్ నేషన్ వన్ ఎలక్షన్ కోసం కేంద్రం జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసింది. లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులు, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులను

మిగతా 2 లో



## లగచర్ల ఘటనలో వారికి బెయిల్ మంజూరు

**ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ కేటీర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఇది కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడిన రైతుల విజయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లగచర్ల ఘటనలో నిందితులుగా ఉన్న వారికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీనిపై కేటీఆర్

మిగతా 2 లో

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

**ఫార్ములా - ఈ రేస్ పై శాసనసభలో చర్చ పెట్టాలి**

**ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**

హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): దమ్ముంటే ఫార్ములా - ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఫార్ములా - ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే

మిగతా 2 లో



# టీఎఫ్డీసీ చైర్మన్‌గా దిల్ రాజు బాధ్యతలు

**రెండేళ్ల పాటు పదవీలో కొనసాగనున్న దిల్ రాజు**



హైదరాబాద్, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రముఖ నిర్మాత దిల్ రాజు బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ వద్ద గల టీఎఫ్ డీసీ కాంప్లెక్స్ లోని కార్యాలయంలో బుధవారం నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు

మిగతా 2 లో




# రాష్ట్రంలో వణికిస్తున్న చలి

- 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదు
- రాత్రిళ్లు చలి మంటలు, ఉదయం పొగమంచు దృశ్యాలే
- వాహనదారులు తప్పని తీవ్ర ఇబ్బందులు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో చలి వణికిస్తోంది. చలి పంజా విసురుతోంది. చలికాలం వచ్చిందంటే చాలు అందరూ గజగజ వణికిపోతారు. ఈ క్రమంలో పలు చోట్ల ఎక్కడ చూసిన రాత్రిళ్లు చలి మంటలు, ఉదయం పూట పొగమంచు దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఇక రెండు, మూడు రోజుల నుంచి చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పొగమంచు అధికంగా ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర

మిగతా 2 లో






ఇప్పటికైనా అన్ని యూనివర్సిటీల్లో పార్ట్ టైం నియమాకాలు చేపట్టినట్లు కాకతీయ విశ్వవిద్యాలయంలో కూడా పార్ట్ టైం నియామకాలను అవసరాల మేరకు చేపడితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పార్ట్ టైం నియామక విధానమే కాకతీయ విశ్వవిద్యాలయంలో కూడా అమలు చేయాలి, అలా కాకుండా గెస్ట్ ఆధ్యాపకులను నియమించాలనే ప్రతిపాదన కాకుండా, పూర్తిస్థాయిలో పార్ట్ టైం నియామకాలు చేపట్టాలి. కొవిడ్ తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. వాటిని మళ్లీ టీచింగ్, పరిశోధన అంశాలతో విద్యా వ్యవస్థను మరియు విశ్వవిద్యాలయాలని బలోపితం చేయాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ అధికారులపై ఉందని విద్యా వేత్తల అభిప్రాయం!!.

# విశ్వవిద్యాలయాలన్నిటిలోకెల్ల కేయులో బోధన..?

## వర్క్ లోడ్ తో కెయూ అస్తవ్యస్థం.. పార్ట్ టైం అధ్యాపకుల నియామకం అనివార్యం

**తెలంగాణ రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలలో ఒక విధానం అమలు చేస్తుంటే కాకతీయ యూనివర్సిటీలో మాత్రం కొన్ని విధానాల్లో మరొక విధానం అవలంబిస్తున్నారు. వర్సిటీలో కొన్ని విధానాల అమలులో చురుకుగా పని చేస్తున్న అధికారులు, కానీ కొన్ని తక్షణ అవసరమైన పార్ట్ టైం అధ్యాపకుల నియామకం లాంటి అంశాలను అమలు చేస్తే వర్సిటీలో భోదనకి ఇబ్బందులు రావని మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయం!. ముఖ్యంగా ప్రతీ విశ్వవిద్యాలయానికి అత్యంత ప్రధానమైనటువంటి అంశాలు బోధన, పరిశోధనలు. ప్రస్తుతం మన రాష్ట్రంలో రెగ్యులర్ ఆచార్యులు ప్రతి విశ్వవిద్యాలయాలలో పదవి విరమణ పొందడం వల్ల వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. అదేవిధంగా పరిశోధనలో కూడా రీసెర్చ్ గైడ్ షిప్ ఇచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతుంది.**

బోధన, పరిశోధన అంశాలలో యూనివర్సిటీలలో తక్కువ అధ్యాపకులు ఉండడం వల్ల నేడు తీవ్రమైనటువంటి ప్రభావాన్ని పొందుతున్నాయి. అయితే విశ్వవిద్యాలయాలలో పరిశోధనకు ప్రత్యామ్నాయ విధానాలు లేనప్పటికీ బోధన కోసం ప్రత్యేకమైనటువంటి ప్రత్యామ్నాయలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం బోధన విషయంలో విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా పార్ట్ టైం విధానంలో నియామకాలను చేపట్టవచ్చు, దాదాపు గత రెండు మూడు సంవత్సరాల నుండి ఒక్క కాకతీయ యూనివర్సిటీలో తప్ప (ఎడ్యుకేషన్ విభాగం మినహా) రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు పార్ట్ టైం అధ్యాపకులను రెండు, మూడు సార్లు నియమించుకోవడం జరిగింది. కానీ కాకతీయ యూనివర్సిటీలో గవర్నమెంట్ పర్మిషన్ లేదని, దాదాపు పదేళ్ల నుండి పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలను చేపట్టలేదు. ఇటీవల నవంబర్ 29న ఉస్మానియా యూనివర్సిటీలో లైబ్రరీ సైన్సు, సైకాలజీ విభాగాలలో, డిసెంబర్ మొదటి వారంలో (తేది: డిసెంబర్ 4) మహిళా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్సు, జాగ్రఫీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సు లాంటి పలు విభాగాలలోబీ అదే విధంగా డిసెంబర్ 12వ తేది నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కూడా ఎకనామిక్స్, చరిత్ర టూరిజం, సైకాలజీ, ఇంగ్లీష్, ఏం.బి.ఏ లాంటి విభాగాలలో కూడా పార్ట్ టైం అద్యాపకుల నియామకానికి నోటిఫికేషన్లు కూడా విడుదల చేయగా కాకతీయ యూనివర్సిటీలో ఇంకా గవర్నమెంట్ పర్మిషన్ లేదని అధికారులు ఆలస్యం చేస్తున్నారు. దీని వల్ల నష్టపోయేది విద్యార్థులే. రాష్ట్రంలో ఒక విశ్వవిద్యాలయం ఒకలా మరొక విశ్వవిద్యాలయం మరొకలా విధానాలు పాటించడం ఎంత వరకు సబబు. యూనివర్సిటీలో అవసరాన్ని బట్టి తాత్కాలిక అధ్యాపకులను, పాలక మండలి అనుమతి తో నియమించుకునే అధికారం ఉంది, పైగా కాకతీయ యూనివర్సిటీకు పూర్తి స్థాయి పాలక మండలి కూడా ఉంది. జి.వో. నెంబర్ 15 లో 3.7 లో యూనివర్సిటీ అవసరం మేరకు పాలక మండలి అనుమతితో తాత్కాలిక నియామకాలు చేపట్టవచ్చని ఉన్న అంశాన్ని కూడా యూనివర్సిటీ అధికారులు గమనించాలి. ఇటీవల పి.హెచ్.డి ప్రవేశాలకు యూ.జి.సి నెట్ పరీక్ష ద్వారానే జరపాలని కేంద్రం ప్రకటించింది కాబట్టి పి.జి. విద్యార్థులు నెట్ లాంటి జాతీయ పరీక్షలలో అర్హత సాధించాలంటే వారికీ గైడెన్స్ ఇవ్వడంలో, ఈ మద్య కాలంలో పి.హెచ్.డి పూర్తి చేసిన, లేదా నెట్, జే.ఆర్.ఫ్ ఉతీర్ణులైన వారిని పార్ట్ టైం అధ్యాపకులుగా నియమిస్తే ఉపయోగపడతారని విద్యా వేత్తల అభిప్రాయం.


గోళ్ళ నరేందర్
విద్యార్థి నాయకులు

## పాఠశాలల సమస్యలపై "శాసన సభలో" మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి

గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు చేపట్టిన చర్యలను ఏకరువు పెట్టారు. గురుకులాల్లో, హాస్టల్స్ లో ఫుడ్ పాయిజన్ ఘటనలు కొత్తగా చోటుచేసుకున్నట్లుగా ప్రతిపక్షం చెప్పడం విడ్డూరమని, గతం నుంచి కూడా అలాంటి ఘటనలు సాగుతున్నాయని, వాటికి తమ ప్రభుత్వం చెక్ పెట్టేందుకు ఆహార భద్రత కమిటీ, టాస్క్ ఫోర్సులు ఏర్పాటు చేసిందన్నారు. డైట్ చార్జీలను 50శాతం చెప్పడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, కమిటీల ద్వారా 21,941 పాఠశాలలు, 495 కేజీబీవీల్లో అత్యవసర పనులు గుర్తించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థినిలు శైలజా, భవాని, లీలావతిల గూర్చి, గురుకులాల సమస్యలపై మంత్రి మాట్లాడుతారని ఆశించామని కాని మంత్రి సీతక్క వాటిని ప్రస్తావించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకులు ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తెలంగాణ రాకముందు 261గురుకులాలు ఉంటే 7,500మంది విద్యార్థులకే చదివే అవకాశముంటే కేసీఆర్ హయంలో 1029 గురుకులాల ఏర్పాటుతో మెరుగైన విద్యను అందిస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సమస్యలు మొదలయ్యాయన్నారు. ఫుడ్ పాయిజన్లు, పాముకాట్లు ఎలుక కాట్లతో గురుకులాలు ప్రాణాంతకంగా మారాయన్నారు. హీరో వస్తే ఒకరు చనిపోతే క్రిమినల్ కేసులు పెట్టారని, గురుకులాల్లో మరణాలపై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ 2014నుంచి గురుకులాల అద్దెలు చెల్లించని మీరా మాట్లాడేదంటూ మండిపడ్డారు. మేం 216ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కడుతున్నామన్నారు. మేం ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుకున్న వారిగా మాకు వాటి సమస్యలు తెలుసన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిన గంగుల కమలాకర్ కు వాటి సమస్యలు తెలియవన్నారు. గురుకులాలను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ రాజకీయం చేస్తుందన్నారు. మొదటిసారి సభకు వచ్చిన పొన్నంకు సభా నియమాలు తెలియవని గంగుల వ్యాఖ్యానించగా, మూడుసార్లు పార్టీ మారిన నీవా మాట్లాడేదంటూ విరుచుకపడ్డారు. గంగుల మళ్లీ మాట్లాడుతూ పెప్పర్ స్ప్రే డూప్లికేట్ నా, దొంగ ఏడుపులా అని నేను అనలేదని, కరీంనగర్ నుంచి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదని వేరే నియోజకవర్గానికి పారిపోయావని పొన్నంపై విమర్శలు చేయగా, పెప్పర్ స్ప్రే ఓరిజినల్ కాదా అనేది పార్లమెంటు ప్రొసిడింగ్స్ లో చూసుకోవచ్చని పొన్నం ప్రతిస్పందించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో నా స్థానంలో పోటీ చేయ్ అని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా అనేక మంది జాతీయ నాయకులు కూడా వేరే చోట్ల పోటీ చేశారని పొన్నం గుర్తు చేశారు. వారంతా పారిపోయారా అని పొన్నం నిలదీశారు. మంత్రి సీతక్క జోక్యం చేసుకుని చర్చను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ వ్యక్తిగత విమర్శలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ ను కోరుతున్నామన్నారు. పాఠశాలలు, హాస్టల్ సమస్యలపై చర్చించకుండా రాజకీయ విమర్శలు చేయడం ఎందుకన్నారు. రికార్డులను పరిశీలించి వ్యక్తిగత దూషణాలను రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చర్చను కొనసాగిస్తూ బీఆర్ఎస్ పాలనలో విద్యా విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టి, ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ఏకరువు పెట్టారు.

## టిఎఫ్డిసీ చైర్మన్‌గా దిల్ రాజు బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి

స్వీకరించిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఆయన ఈ పదవీలో కొనసాగనున్నారు. డిసెంబర్ 18న దిల్ రాజు తన పుట్టిన రోజు సందర్భంగా ఈ పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం. ఈ కార్యక్రమానికి సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా పలువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, సినీ ఇండస్ట్రీ ప్రముఖులు హాజరై దిల్ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. దిల్ రాజు సారథ్యంలో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, ప్రపంచ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ టీఎఫ్ డీసీ చైర్మన్ గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు సినిమాకు పూర్వ వైభవం తీసుకురావాలని అందుకు అందరి సహకారం అవసరమన్నారు. తెలంగాణా సంస్కృతి అభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తానని, తెలుగు సినీ పరిశ్రమ మద్రాస్ నుంచి వచ్చిన తర్వాత గుర్తింపు వచ్చిందన్నారు. ప్రస్తుతం తెలుగు సినిమా ఏంతో అభివృద్ధి చెందిందని, అలాగే ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పరిశ్రమ ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. టీఎఫ్ డీసీ చైర్మన్ గా నాపై చాలా బాధ్యత ఉందని, ఫిల్మ్ ఇండస్ట్రీ కి ప్రభుత్వానికి మధ్యలో వారధిగా పనిచేస్తానని, సినీ పరిశ్రమలోని అన్ని విభాగాల సమస్యలతో పాటు డిస్ట్రిబ్యూటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

## శాసన సభలో ప్రవేశపెట్టనున్న భూ భారతి బిల్లు

మొదటి పేజీ తరువాయి

కక్షలు, కార్పణ్యాల దాకా వెళ్లిందని అన్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ధరణి పరిస్థితి తయారైందని అన్నారు. గత పాలకులు తెచ్చిన ఈ లోప భూఇష్ట చట్టం వల్ల భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటి కాళ్ల కింద నేల కదిలిపోయిందని విమర్శించారు. బాధితులు తమ సమస్యలు చెప్పుకున్నా పరిష్కారం చేసే మార్గం లేకుండా పోయిందని చెప్పారు. లోపభూయిష్టమైన ఆర్వోఆర్ చట్టం-2020ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. లోపాల కారణంగా నాలుగు నెలలు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని అన్నారు. 18 లక్షల 26వేల ఎకరాలు పార్ట్-బీలో ఉందని, ఏ కారణం చేత ఈ భూమిని పార్ట్-బీలో పెట్టారనేది తెలియడం లేదన్నారు. పాసు బుక్కుల్లో ఉన్న భూములకు, పొజిషన్‌లో ఉన్న భూములకు తేడా కనుక్కోవడానికి చట్టంలో నిబంధనలు రూపొందించామని చెప్పారు. ఈ దేశంలో భూ సంస్కరణలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ అంటేనే ఒక బాధ్యత అని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే ధరణిని సాగనంపామని, ఆ స్థానంలో భూభారతి తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామం కంఠాలు, ఆబాదీ భూములకు భూభారతి చట్టం పరిష్కారమార్గం చూపుతుందని అన్నారు. సభ్యులు సలహాలు, సూచనలు చేస్తే తీసుకుంటామని పొంగులేటి చెప్పారు. సాదా బైనామాల కింద 9.24లక్షల దరఖాస్తులొచ్చాయని, వాటికింద అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలుపుకునే అవకాశం చట్టంలో కల్పించామని వివరించారు. ప్రతి ఏడాదీ జమా బందీ కార్యక్రమం నిర్వహించేలా చట్టంలో పొందుపరిచామని వివరించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేలా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు.

### మంచిని స్వీకరిస్తం

ధరణి పోర్టల్ లోని మంచిని స్వీకరిస్తామని, ఎలాంటి భేషజాలకు వెళ్లబోమని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇప్పటి వరకు 22,23 సార్లు డ్రాఫ్టులు మార్చి బిల్లును ప్రవేశపెడుతున్నామని వివరించారు. ప్రత్యేక కమిటీ 33 జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు.

### ప్రతి రైతుకూ భూధార్

భూభారతి చట్టం ప్రకారం ప్రతి రైతుకూ భూధార్ కార్డులను అందించనున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఒక కోడ్ కేటాయిస్తామని చెప్పారు. దానిని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భూభారతి చట్టంలో భూధార్ అంశాన్నీ చేర్చామని వివరించారు.

### ప్రతి ఏటా జమాబందీ

గతంలో భూములకు సంబంధించి జమాబందీ నిర్వహించే వారని, ఇకపై ప్రతి ఏటా జమాబందీ నిర్వహించడం వల్ల రైతులకు తమ భూమి తమ స్వాధీనంలో ఉందనే నమ్మకం ఏర్పడుతుందని ఈవిషయాన్ని కూడా భూభారతి చట్టంలో చేర్చినట్టు మంత్రి పొంగులేటి చెప్పారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ

మొదటి పేజీ తరువాయి


నియమించింది. మొత్తం 31 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, ధర్మేంద్ర యాదవ్, కళ్యాణ్ బెనర్జీ, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, సంబిత్ పాత్ర, అనిల్ బలూని, అనురాగ్ సింగ్ ఠాకూర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీకి పీపీ చౌదరి ఛైర్మన్‌గా నియమించారు. నివేదికను తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో సమర్పించాలని కేంద్రం సూచించింది.

కమిటీ సభ్యులు వీళ్లే(లోక్‌సభ)

1. పీపీ. చౌదరి
2. సీఎం రమేష్
3. బన్సూరి స్వరాజ్
4. పురుషోత్తం భాయ్ రూపాలా
5. అనురాగ్ సింగ్ ఠాకూర్
6. విష్ణు దయాళ్ రామ్
7. భర్తృహరి మహతాబ్
8. సంబిత్ పాత్ర
9. అనిల్ బలూని
10. విష్ణు దత్ శర్మ
11. ప్రియాంకాగాంధీ
12. మనీష్ తివారీ
13. సుఖ్దేవ్ భగత్
14. ధర్మేంద్ర యాదవ్
15. కల్యాణ్ బెనర్జీ
16. టీఎం సెల్వగణపతి
17. జీఎం హరీష్ బాలయోగి
18. సుప్రియా సూలే
19. శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే
20. చందన్ చౌహాన్
21. బాలశౌరి వల్లభనేని

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

మొదటి పేజీ తరువాయి



విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది అని కేటీఆర్ మండిపడ్డారు. నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. మరోసారి చెబుతున్నాను. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్‌ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## విడుదలైన టెట్ పరీక్షల షెడ్యూల్

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులు వచ్చినట్లు టెట్ కన్వీనర్ తెలిపారు. టీఎస్ టెట్ - 2025 పరీక్షలో రెండు పేపర్లు (పేపర్-1, పేపర్-2) ఉంటాయి. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు భోధించాలనుకునేవారు పేపర్ 1 పరీక్షకు హాజరవ్వాలి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు చెప్పేవారు పేపర్ 2 పరీక్ష రాయాలి. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగరతి వరకు బోధించాలనుకునేవారు పేపర్-1, పేపర్-2 (రెండింటికి) హాజరు కావాలి. అభ్యర్థులు ప్రణాళిక ప్రకారం టైమ్‌మేనేజ్‌మెంట్ చేసుకుంటూ ప్రిపేర్ అవ్వాలి. టెట్- పేపర్1 రాసే అభ్యర్థులు కంటెంట్ 3 నుంచి 8 తరగతుల వరకు చదవాలి. పేపర్-2 రాసే అభ్యర్థులు కంటెంట్ 3 నుంచి 10వ తరగతి స్థాయి వరకు చదవాలి. తెలుగు అకాడమీ పుస్తకాలు చదివి నోట్సు రాసుకోవాలి. సాధన చేయాలి. ప్రైవేట్ పబ్లికేషన్స్ కాకుండా తెలుగు అకాడమీ బుక్స్ చదివి, నోట్స్ రాసుకొని రివిజన్ చేయడం వలన ఎక్కువ స్కోర్ చేయొచ్చు.

## గురుకులాల్లోని దారుణాలకు ఇది మరో నిదర్శనం

మొదటి పేజీ తరువాయి

తెలిసిందే. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణ గురుకులాల్లో జరుగుతున్న దారుణాలకు ఇది మరో నిదర్శనం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 1971లో ముఖ్యమంత్రి హోదాలో దివంగత పీవీ నరసింహారావు దేశంలో మొదటి గురుకులాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేల్‌లో ప్రారంభించారు. నేడు అదే గురుకులంలో విద్యార్థినితో వంట చేయిస్తే, వేడి రాగి జావ పడి ఆ విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైన పరిస్థితి నెలకొంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకవైపు అసెంబ్లీలో గురుకులాలపై చర్చ, మరోవైపు అదే సమయంలో ఈ దారుణం. గురుకులాల్లో దారుణమైన పరిస్థితుల గురించి ప్రశ్నిస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే తప్ప, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనలో రోజురోజుకి దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని కాపాడండి. గాయపడ్డ విద్యార్థినికి మంచి వైద్యం అందించండి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

## ఈ నెల 28న ఆవిష్కృతంకానున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్



మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. మహిళలకు, పురుషులకు వేర్వేరు వెయిటింగ్ హాల్స్, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ని నిర్మించారు. టెర్మినల్ తొలి అంతస్తులో కెఫ్ టేరియా, రెస్టారెంట్, రెస్ట్ రూమ్ తదితర సౌకర్యాలను కల్పించారు. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం అందుబాటులో ఉంటుంది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గిచేందుకు చర్లపల్లి టెర్మినల్‌ను రైల్వేశాఖ అభివృద్ధి చేసింది. చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. దాదాపు 25 ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇక్కడి నుంచే నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు బోర్డుకు ప్రతిపాదనలు పంపింది. ఇందులో పలు రైళ్లకు సంబంధించి అనుమతి ఇచ్చింది. ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లు సైతం ఇక్కడే అన్‌లోడ్ చేసుకునే వీలుంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

## లగచర్ల ఘటనలో వారికి బెయిల్ మంజూరు

మొదటి పేజీ తరువాయి

ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కొడంగల్ రైతులకు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కి 35 రోజుల వేదన తర్వాత ఉపశమనం లభించిందని తెలిపారు. వీరంతా అదానీ సిమెంట్ ప్లాంట్ కోసం, ఆయన బంధువుల ఫార్మా కంపెనీల కోసం భూములు సేకరించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బలవంతపు%జూ%చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారని అన్నారు. ఇది అణిచివేత కాంగ్రెస్ ప్రభుత్వంపై ధీటుగా పోరాడిన కొడంగల్ రైతుల విజయం అని కేటీఆర్ రాసుకొచ్చారు. కాగా వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఫార్మాసిటీ కోసం భూసేకరణకై ప్రజల అభిప్రాయాలు సేకరించేందుకు వెళ్లిన కలెక్టర్ సహా ప్రభుత్వ అధికారులపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ కేసులో పోలీసులు పట్నం నరేందర్ రెడ్డి సహా దాడిలో పాల్గొన్న వ్యక్తులను అరెస్ట్ చేశారు.

## టీపీసీసీ చీఫ్ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ కార్యక్రమం

హైదరాబాద్, డిసెంబర్ 18. (తీన్మార్ న్యూస్): టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో రాజ్ భవన్ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెక్లెస్ రోడ్డు నుంచి కాలినడకన రాజ్ భవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు చేరుకున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై బైటాయించిన కాంగ్రెస్ నేతలు అదానీ, మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పార్లమెంట్ లో ఈ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాజ్ భవన్ ముట్టడి కి వెళ్తున్న మతను హైదరాబాద్ పోలీసులు కూతవేటు దూరంలో అడ్డుకున్నారని ఈ క్రమంలోనే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రభుత్వంలో ఉండి తాము చేస్తున్న ఈ నిరసన కొంత మందికి నచ్చొచ్చు, నచ్చకపోవచ్చని అన్నారు. అలాగే పార్లమెంట్‌లో అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని అలా చేస్తూ అదానీ కచ్చితంగా జైలుకు వెళ్తారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అలాగే అదానీ వ్యవహారంపై తెలంగాణ అసెంబ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సభలో అదానీ అంశంపై తీర్మానం చేసి పార్లమెంటుకు పంపుదామని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు.

## రాష్ట్రంలో వణికిస్తున్న చలి

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలోనే కాదు మిట్ట మధ్యాహ్నం కూడా ఈదురు గాలులు వీస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలలో చలి ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో చలి తీవ్రత నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాలవేళల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఉదయం 9.40 నుంచి సాయంత్రం 4.30 వరకు స్కూళ్లు నడపాలని ఆదేశించింది. ప్రస్తుతం 9.15 నుంచి సాయంత్రం 4.15 వరకు పాఠశాలలు నడుస్తున్నాయి. కాగా, తాము చలితో ఇబ్బందులు పడుతున్నామని, టైమింగ్స్ మార్చాలని పలు జిల్లాల విద్యార్థులు కోరుతున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# కోట్లు కురిపిస్తున్న కనిపించని కరెన్సీ

బిట్‌కాయిన్ రికార్డ్ ధరకు చేరింది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల కాలంలో పెట్టుబడిదారులు ఆలోచన మారింది. ముఖ్యంగా పెరిగిన ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడినిచ్చే పథకాలపై ఆసక్తి చూపుతున్నారు. అలాగే తక్కువ సమయంలోనే అధిక లాభాలను పొందాలని కోరుకుంటున్నారు. పెట్టుబడి రిస్క్ అయినా పర్లేదు కానీ అధిక రాబడి కోరుకునే వారు ఎక్కువగా ఉన్నారు. ఇటీవల కాలంలో బిట్ కాయిన్‌లో పెట్టుబడి వారికి అధిక రాబడి వచ్చింది.డోనల్డ్ ట్రంప్ ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుంచి ఈ క్రిప్టోకరెన్సీ ధర 50 శాతానికి పైగా పెరిగి గరిష్ఠ స్థాయిని తాకింది. క్రిప్టో కరెన్సీకి అమెరికాను రాజధానిగా చేస్తానని ట్రంప్ గతంలో ప్రకటించిన నేపథ్యంలో ఇంకా ఇది జోరందుకుంది. ఇక కొవిడ్ పరిణామాల ప్రారంభంలో 5 వేల డాలర్లుగా ఉన్న బిట్ కాయిన్ .. 2021 నవంబర్ నెలలో 69 వేల డాలర్ల స్థాయికి పెరిగింది. మళ్లీ భారీగా పడిపోయింది కూడా. ఇప్పుడు ట్రంప్ గెలవడంతో రికార్డు స్థాయికి చేరింది. 2009లో పరిచయమైన బిట్‌కాయిన్ ధర అప్పుడు జీరోగా ఉంది. 2011 ఫిబ్రవరిలో ఒక డాలరుకు చేరింది. ఇప్పుడు ప్రపంచంలోనే మోస్ట్ పాపులర్ క్రిప్టో కరెన్సీగా అవతరించింది. లక్ష డాలర్లకు సమీపంలోకి వచ్చింది. నవంబర్ 26న ఈ బిట్ కాయిన్ రేటు 93 వేల డాలర్లుగా ఉంది. ఈ లెక్కన ఉదాహరణకు 2011లో రూ. 100 ఇన్వెస్ట్ చేసినట్లయితే 2.22 బిట్‌కాయిన్స్ వచ్చేవి. అప్పట్లో ఒక డాలర్ ధర రూ. 45.50 గా ఉండేది. ఈ లెక్కన ఇప్పుడు ధర బిట్ కాయిన్ ధర రూ. 82 లక్షలపైనే ఉండగా.. 2.22 బిట్‌కాయిన్స్‌పై ఇది రూ. 1.65 కోట్లుగా ఉంది. అంటే 2011లో రూ. 100 పెట్టుబడిని రూ .1.65 కోట్లు చేసిందన్నమాట. ఇంకాస్త పెట్టుబడి అప్పట్లో ఎక్కువ పెడితే ఇంకా ఎక్కువ రిటర్న్స్ వచ్చేవని చెప్పొచ్చు.ఇది కేవలం ఎంత పెట్టుబడికి ఎంత రిటర్న్స్ వచ్చాయని తెలిపేందుకు ఉద్దేశించింది మాత్రమే. దీంట్లో పెట్టుబడులు పెట్టాలని మేం చెబుతున్నట్లు కాదు. దీని కోసం ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలి. భారత్‌లో క్రిప్టో కరెన్సీకి చట్టబద్ధత లేదు. ఇందులో వచ్చే లాభాలపై పన్ను కూడా భారీగానే ఉంటుంది. ఆర్బీఐ కూడా కొంతకాలంగా క్రిప్టో కరెన్సీపై కఠిన వైఖరి ప్రదర్శిస్తోంది.ఆసియా ట్రేడ్‌లో ఒక దశలో 1,06,000 డాలర్లకు(రూ. 90 లక్షలు) చేరిన బిట్‌కాయిన్ ధర తర్వాత 1,05,000 డాలర్లకు(సుమారు రూ. 89.10 లక్షలు) తగ్గింది.బిట్‌కాయిన్ ప్రపంచంలోని క్రిప్టోలన్నిటిలోనూ అత్యంత ఎక్కువ విలువ కలిగిన కరెన్సీ.క్రిప్టోకరెన్సీల విషయంలో బైడెన్ కంటే ట్రంప్ మరింత అనుకూలంగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు.నవంబర్ 5, 2024న బిట్‌కాయిన్ ధర 67,800 డాలర్లు అంటే సుమారు రూ. 58 లక్షలు ఉంటే డిసెంబర్ 5 నాటికి బిట్‌కాయిన్ ధర 1,02,639 డాలర్లకు సుమారు రూ. 88 లక్షలకు చేరుకుంది. బిట్ కాయిన్ ధర మునుపెన్నడూ లేని విధంగా కేవలం ఒక నెలలో 51 శాతం జంప్ చేయడం ఆశ్చర్యపరిచిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో బిట్ కాయిన్ ధర భారీగా పెరిగిందని పేర్కొంటున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఇటీవలి విజయం సాధించడంతో బిట్ కాయిన్స్‌లో పెట్టుబడికి ఇన్వెస్టర్లు ఎగబడ్డారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ప్రో క్రిప్టోగా విస్తృతం ప్రచారం చేయడంతో ట్రంప్ విజయంతో క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో కొత్త విశ్వాసాన్ని రేకెత్తించిందని వివరిస్తున్నారుఓ పెట్టుబడిదారుడు నవంబర్ 5న బిట్‌కాయిన్‌లో రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే ప్రస్తుత పెరుగుదలతో రూ. 1,51,712 చేరుకుంది. అంటే ఒక నెలలో లాభం రూ. 51,712గా ఉంది. అంటే నెలలోనే 51.7 శాతం రాబడి వచ్చింది. అలాగే రూ. 10 లక్షల పెట్టుబడిపై రూ. 5,17,120, రూ.50 లక్షల పెట్టుబడిపై లాభం రూ.25,85,600. బిట్ కాయిన్ పెరుగుదల అనేది ట్రంప్ ఎన్నికల విజయంతో ఆధారపడిం ఉందని నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ ఎన్నికతో బిట్ కాయిన్ అధిక లాభాలను అందించింది. క్రిప్టోకరెన్సీల కోసం అనుకూలమైన రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను ట్రంప్ గతంలో సూచించాడు. అందువల్ల అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను పెంచింది.డిజిటల్ ఆస్తులలో సంస్థాగత పెట్టుబడిని ప్రోత్సహిస్తూ ట్రంప్ పరిపాలన వ్యాపార స్నేహపూర్వకంగా ఉంటుందని భావిస్తున్నారు. క్రిప్టో అనుకూల ప్రభుత్వం కఠినమైన నిబంధనలకు సంబంధించిన ఆందోళనలను తగ్గించి, మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచుతుంది. క్రిప్టోకరెన్సీలకు ప్రపంచవ్యాప్త ఆమోదం పెరుగుతుండటంతో భారతీయ పెట్టుబడిదారులు బిట్‌కాయిన్‌ను ఎక్కువగా అన్వేషిస్తున్నారు. వాజిర్ ఎక్స్, కాయిన్ స్విచ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు తాజా ర్యాలీ మధ్య అధిక ట్రేడింగ్ వాల్యూమ్‌లను నివేదించాయి. అయితే భారతదేశంలో నియంత్రణ అనిశ్చితి ఆందోళనకరంగానే ఉందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.దేశంలోని వ్యూహాత్మక చమురు నిల్వల తరహాలోనే డిజిటల్ కరెన్సీ జాతీయ నిల్వలను సృష్టించడాన్ని పరిశీలిస్తున్నట్లుగా గురువారం ట్రంప్ పునరుద్ఘాటించారు.ఆ ప్రకటన తరువాత బిట్‌కాయిన్ ధర పరుగులు తీసింది.'అమెరికా ఎన్నికల నాటి నుంచి బిట్‌కాయిన్ ర్యాలీ ఊపందుకుంది' అని బీబీసీతో ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ ఎక్స్ఎమ్. కామ్‌కు చెందిన పీటర్ మెక్‌గుయిర్ చెప్పారు.'ఈ ఏడాది చివరికల్లా బిట్‌కాయిన్ 1,20,000 డాలర్లు (రూ. కోటి), వచ్చే ఏడాది మధ్యలో 1,50,000 డాలర్లు (సుమారు రూ. 1.27 కోట్లు) దాటుతుందని చాలామంది ఇన్వెస్టర్లు భావిస్తున్నారు" అని ఆయన తెలిపారు.అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోకరెన్సీ సలహాదారుగా సిలికాన్ వ్యాలీ ఎంటర్‌ప్రెన్యూర్ డేవిడ్ సాక్స్ పేరును ఈ నెల మొదట్లో ట్రంప్ ప్రకటించారు.డేవిడ్ సాక్స్ గతంలో పేపాల్ (ఖజీఎఖజీశ్రీ) సంస్థ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. ట్రంప్ అడ్వైజర్ ఎలాన్ మస్క్‌కు ఆయన సన్నిహితుడు.

# వసతి గృహాలు, పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**– నిత్యం తనిఖీలు నిర్వహించాలి**
**– జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని వసతి గృహాలు పాఠశాలలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలనీ, మండల ప్రత్యేక అధికారులు నిత్యం వసతి గృహాలు పాఠశాలలు తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని అన్ని వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది సంబంధిత అధికారులతో కలిసి పాఠశాలలు ,వసతి గృహాల అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాలలో పాఠశాలలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, చిన్న చిన్న మైనర్ రిపేర్, డ్రైనేజ్ సిస్టం, త్రాగునీరు ఆర్వో ప్లాంట్స్, విద్యుత్ సౌకర్యాలు, డోర్స్, విండోస్ రిపేర్లు, అంతర్గత పనులు, తదితర పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. డైట్ మెనూ చాట్ ప్రకారం రుచికరమైన ఆహారం షెడ్యూల్ ప్రకారం పిల్లలకు అందించాలని, సానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, పిల్లలకు మానసిక నైపుణ్యత మీద అవగాహన కల్పించాలని, ప్రతి విద్యా సంస్థలో సైకాలజిస్ట్ చే క్లాసులు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాలలో సానిటేషన్ బాధ్యత సంబంధిత గ్రామపంచాయతీ,మున్సిపల్ సిబ్బంది తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని డోర్స్ కి మెష్ సమకూర్చాలని, డైనింగ్ హాల్ లో పరిశుభ్రత పాటించాలని, వంటసిద్ధం చేసే సిబ్బంది నిత్యం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పిల్లలకు అందించే రుచికరమైన భోజనం, విద్య, ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ వెల్ఫేర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, మోడల్ స్కూల్స్, అన్ని విద్యాసంస్థలు ప్రతినిత్యం విద్యార్థులను గమనిస్తూ పాఠశాలలోని ఏవైనా పెండింగుపనులు ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియపరచి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు,డిసిఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ మరియన్న, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ వీరభద్రమ్, డిటిడబ్ల్యుఓ సైద నాయక్, డిఎఓ విజయనిర్మల, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, డి.ఈ అరుణ్ కుమార్, సిపిఓ సుబ్బారావు, డిపిఓ హరిప్రసాద్, డిఎఫ్ఓ వీరన్న, డిసిఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డిసిఓ లు, ఆర్సిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్ల తనిఖీ





మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళిధర్ ఆదేశానుసారం, బుధవారం మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం నేతృత్వంలో మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులైన ధరణి, మేడ్ విజన్, నిక్మా హెల్త్ కేర్ సెంటర్, తేజస్వి నర్సింగ్ హెూమ్, మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ, మేనేజ్మెంట్ వారు అంధించే సేవలకు తీసుకునే రుసుములకు సంబంధించిన ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆసుపత్రులో సిబ్బంది యొక్క వివరాలను మరియు వారి యొక్క అర్హత సర్టిఫికెట్స్ ను అందుబాటులో వుంచాలని, ఒకవేళ సిబ్బంధిని గాని డాక్టర్ లను కానీ మార్చినట్టైతే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయమునకు అట్టి వివరములు ముందు గానే తెలియ పరచాలని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష నేరమని, శిక్షార్హులవుతారని పేర్కొంటూ, ప్రతి నెల ఐదవ తేదీ లోపు పిసిపిఎన్డిటి ఎఫ్ దరఖాస్తులు జిల్లా కార్యాలయానికి పంపించాలని అన్నారు. ఈ తనికీలలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, ఎల్ డి కంప్యూటర్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వీడ్కోలు సన్మానం



ములుగు జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో బదిలీపై వెళ్లిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వీడ్కోలు సన్మాన మహెూత్సవ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ములుగు జిల్లా లో ఒక సాధారణ గిరిజన బిడ్డగా జన్మించి ఉన్నత చదువులు చదివి ములుగు జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా దాదాపు 8 సంవత్సరాలు పనిచేసే ములుగు జిల్లాలో నీ మారుమూల గ్రామాలను మరియు వాగులు వంకలు దాటి అడవిలో మరియు గుట్ట ప్రాంతంలో నివసించుచున్న గిరిజనులు మరియు గుత్తి కోయాలకు వైద్య సదుపాయాలు అందించడమే గాక అక్కడివారికి ఆహార అలవాట్లు మరియు ప్రభుత్వ వైద్య సేవల పట్ల అవగాహన కల్పించి గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నత అధికారులు రాష్ట్ర స్థాయి మంత్రివర్యుల ఇతర రాష్ట్ర గవర్నర్ చేత అభినందనలు అందుకున్న అప్పయ్య వైద్య సేవలు, ములుగు జిల్లాకే కాక ఇతర జిల్లాల అధికారులకు ఆదర్శవంతుడిగా ఎదిగినాడని ప్రస్తుత జిల్లా వైద్యాధిక శాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మరియు ఇతర వ్యక్తులు కొనియాడి, గజమాలతో ఘనంగా సన్మానించారు.

బదిలీపై వెళ్లిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ బాధ్యత ఇష్టంతో చేసినట్లయితే , ఆ శాఖ కు వన్నె తేవడమే కాక వ్యక్తిగతంగా కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతాడని వ్యక్తపరిచారు. వైద్య ఆరోగ్యశాఖలో ఆశ కార్యకర్త నుండి రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి సమన్వయంతో అందరినీ కలుపుకుపోయే గుణశీలుడని , కంటైనర్ ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశాడని ప్రతి ప్రోగ్రాంకు, నిర్దిష్టమైన ప్రణాళికలను తయారుచేసి కార్య నిర్వహణలో శక్తి వంచన లేకుండా పనిచేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్ డాక్టర్ చంద్రకాంత్ ఆఫీస్ సూపరిండెంట్, ఇన్చార్జి డెమో సంపత్ ఏ.మో ఓ దుర్గారావు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపద రావు ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ గణేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆర్బిఎస్కె టీం డాక్టర్స్ మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆఫీస్ డి ఈ ఓ కిరణ్ సతీష్ అనిల్ మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముక్తి వనం పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరంలో ఉన్న ముక్తి వనం పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలోని ముక్తివనం పార్కును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని అటవీశాఖ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిరంచ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ముక్తి వనం పార్క్ గురించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముక్తి వనం పార్కు అభివృద్ధి చేయడం వల్ల పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కాళేశ్వర దేవస్థానానికి అతి సమీపంలో ఉన్నందున పార్కు అభివృద్ధి వల్ల ఈ ప్రాంతం యొక్క ప్రాధాన్యత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, తహశీల్దార్ కృష్ణ, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు ప్రారంభం



**చైర్మన్ చంద్రారెడ్డి**

నాగారం, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): మున్సిపాలిటీలోని మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు సింహపురి కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.19.50 లక్షలతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మాణ పనులకు చైర్మన్ చంద్రారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ కొట్టె దివ్య దయాకర్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో శిక్షణా సమావేశం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ (పోషణ మరియు ఆరోగ్య సమాచారాన్ని సేకరణపై బుధవారం సుభాష్ నగర్ లోని సీడీపీఓ కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోషన్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్లు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ అధికారి చిన్నయ్య మాట్లాడుతూ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ మరియు పోషన్ ట్రాకర్ అమలులో సమర్థతను మెరుగుపరచడానికి నేషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ మరియు పోషణ ట్రాకర్ ప్రాధాన్యత గురించి వివరించారు. పోషణ ట్రాకర్ లో డేటాను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నేషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సమగ్ర ఆరోగ్య సేవలు అందించడంలో పోషణ ట్రాకర్ కీలకమని, అందుకే సిబ్బందికి ఈ పథకాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ సమావేశ ప్రధాన లక్ష్యని అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న చిల్డ్రన్స్ హెూం ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, మహాదేవ పూర్ సీడీపీవోలు, బ్లాక్ కో ఆర్డినేటర్లు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సమగ్ర వివరాలను నమోదు చేయాలి



**ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పరిశీలన**
**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్**

జనగామ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): బుధవారం, జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్ లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్న తీరును పర్యవేక్షించి, తగు సూచనలు చేశారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు కృషి చేయాలని, దరఖాస్తుదారుల సమగ్ర వివరాలను ఎలాంటి నిర్లక్ష్యానికి ఆస్కారం ఇవ్వకుండా ఖచ్చితత్వంతో యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా నిలుస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ..

చేర్యాల: రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే, నాగపురి రాజలింగం తనయుడు కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 10 మంది కి మంజూరు అయిన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం నివాసంలో కిరణ్ కుమార్ లబ్ధిదారులు ఎస్. స్వామి, కె.మంజుల,జి. శిరీష, కే. జ్యోతి, ఏ. విజయ,కె. ఎల్లవ్వ, కె. కనకయ్య, పి. దశమత్ రెడ్డి, ఎస్. కిష్టయ్య, పి. సౌందర్యకు సుమారు రూ. 3 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షులు బాలరాజు, సత్యం యాదవ్,డానియల్,కనకయ్య,ఎన్ ఎస్ యు ఐ మాజీ మండల అధ్యక్షుడు బండారి సతీష్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఏకవీరా దేవి ఆలయ పునరుద్ధరణ

**– జిల్లా కలెక్టర్ శడాక్టర్ సత్య శారదా**

వరంగల్ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): కాకతీయుల కాలంలో నిర్మించిన కాకతీయ ఇలవేల్పు ఏకవీరా దేవి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపారు. బుధవారం కలెక్టర్ మొగిలిచర్ల గ్రామంలో పర్యటించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని రాష్ట్ర పురావస్తు శాఖ , పర్యాటక , రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయడం జరిగింది. మొగిలిచెర్ల గ్రామ చరిత్ర, ఏక వీర దేవాలయ చరిత్రను టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య విపులంగా కలెక్టర్ కి వివరించారు. వందల సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన ఎకవీర దేవి ఆలయాన్ని పరిరక్షించాలని, ఆలయ అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని, పురావస్తు శిల్పాలను పరిరక్షణ చేయాలని, ఇతర మౌలిక సదుపాయలను ఏర్పాటు చేయాలని పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లు నాయక్ ను కలెక్టర్ ఆదేశించారు. పునరుద్ధరణ పనులను చేపట్టి ఆలయాన్ని ప్రజలు, పర్యాటకులకు సందర్శనార్థం అందుబాటులోకి తేవాలని సూచించారు. వాటికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆలయ భూములకు సంబంధించి సర్వే చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. గ్రామంలో వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న శిల్పాలను ఒకే చోట భద్రపరిచి ప్రదర్శనకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిల్లా పురావస్తు శాఖ మల్లు నాయక్, తహసీల్దార్ రియాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

# మైనారిటీ మహిళలు కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): నిరుపేద కుట్టు శిక్షణ పొందిన మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద కుట్టు శిక్షణలో నైపుణ్యాన్ని పెంపొందించాలని ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నందున అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.రవీందర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుపేద నిరుద్యోగ కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు శిక్షణలో నైపుణ్యాన్ని అప్గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తుందన్నారు. అర్హులైన మహిళలు తమ దరఖాస్తులను TGOBMM వెబ్ పోర్టల్ ద్వారా tgobmms.cgg.gov.in ద్వారా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు ఆన్లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జనగామ లో అందజేయాలన్నారు. మైనారిటీ కమ్యూనిటీకి చెందిన (ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు) నిరుద్యోగ మహిళలలో నిరుపేదలు, విడాకులు, వితంతువులు, అనాధలు ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు లేదా రెండు అందుబాటులో లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం మాత్రమే అందించాలన్నారు. అభ్యర్థి యొక్క తల్లిదండ్రులు లేక సంరక్షకుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు కంటే తక్కువ, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల వరకు ఉండాలన్నారు. దరఖాస్తుదారి యొక్క వయోపరిమితి 18 సంవత్సరముల నుండి 55 సంవత్సరంల మధ్య ఉండాలన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా జత చేయాలన్నారు. ఒక కుటుంబానికి ఒక కుట్టు మిషన్ ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా టైలరింగ్ కోర్సులో శిక్షణ పొంది ఉండాలని, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంద న్నారు. కుట్టు శిక్షణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని, కనీస విద్యార్హత 5వ తరగతి గా పేర్కొన్నారు. దరఖాస్తు దారు గత ఐదు సంవత్సరములలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఎటువంటి ఆర్థిక సహాయం పొందలేదని స్వీయ ప్రకటన ఇవ్వాలన్నారు. ఇతర వివరములకు 9059679793, 9346951278, 9951933034 సెల్ ఫోన్ నెంబర్ల ద్వారా కార్యాలయం సమయంలో సంప్రదించాలన్నారు.

# యాసంగి పంటకు సరైన సమయంలోనే నీరు అందిస్తాం..




జన్నారం: కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న రైతులకు యాసంగి పంటకు సరైన సమయంలోనే నీరు అందిస్తామని జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు రాజశేఖర్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు . నెల రోజుల క్రితమే ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కడెం నీటి విడుదలపై క్లారిటీ ఇచ్చారన్నారు. కానీ అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు నీటిని విడుదలచేయాలని రాద్ధాంతరం చేయడం సరైనది కాదన్నారు.ఇప్పటికే కడెం ఆయకట్టు కింద ఉన్న చివరి పొలాలలో వరి కోతలు పూర్తి కాలేదు అన్నారు. కోసిన వరి పొలాల్లో వరిగడ్డి ఇంకా రైతుల ఇండ్లకు చేరలేదన్నారు. రైతుల పొలంపరులు ఇంకా పూర్తి కాకముందే ఇప్పుడు నీటి విడుదల చేస్తే నీరు వృధా అవుతుందన్నారు. రైతులకు కావలసినప్పుడు సరైన సమయంలోనే రైతుల అభిప్రాయాలు తీసుకొని కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ నాయకులు అవగాహన లేని మాటలు మాట్లాడుతూ, రాజకీయ ఉనికి కోసమే, రైతులపై ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు తప్పకుండా రెండో పంటకు నీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు,ఇసాక్ ఫసియుల్లా, ఇందయ్యా ముత్యం సతీష్ లక్ష్మీ నారాయణ, సుధాకర్ నాయక్ ఏ వి ఆర్, మత్స్య శంకరయ్య నందు నాయక్ గంగన్న యాదవ్ దుర్గం గంగాధర్, కుమారస్వామి,గోపి సత్య నారాయణ,లక్ష్మి, రాయ మల్లు గౌడ్,నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్వేంద్రియానం నయనం ప్రధానం..



జన్నారం: సర్వేంద్రియానం నయనం ప్రధానం అని చెన్నారం మండల కేంద్రంలో ఉన్న ఎల్ వి ప్రసాద్ నేత్రాలయ బ్రాంచ్ జూనియర్ అడ్మిన్ జయరాజు అన్నారు బుధవారం ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ లో, మండల కేంద్రంలో ఎల్ వి ప్రసాద్ ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ లో 35,796 మంది పరీక్షలు చేసుకున్నారన్నారు. అందులో నుంచి అదిలాబాద్ ఎల్వి ప్రసాద్ బ్రాంచ్ కి 5168 మందిని పంపించి వారికి శస్త్ర చికిత్సలు అందించామన్నారు. 13063 మందికి కళ్లద్దాలు రిఫర్ చేయగా1625 కళ్లద్దాలను తీసుకున్నారన్నారు. కళ్ళు సక్రమంగా ఉంటేనే ప్రకృతిని ప్రపంచాన్ని చూడగలమన్నారు. అన్ని అంగాలలో కళ్ళు ప్రధానమైనవి అన్నారు. కళ్ళని ఎప్పుడూ అప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో, స్థానిక ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ లక్ష్మణ్, నేత్ర వైద్యశాల విజన్ తెరపిస్ట్ నిఖిల్,మానస డాటా ఎంట్రీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో జాతీయ జెండాకు అవమానం..



కోదాడరూరల్ : సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై జాతీయ జెండాకు అవమానం జరిగింది. ఇటీవల నియోజకవర్గంలోని నడిగూడెం మండల కేంద్రంలో అతిపెద్ద జాతీయ జెండా ను ఆవిష్కరణ కోసం ట్రైల్ రన్ నీర్వహించారు. అంతేకాకుండా జనవరి మొదటి నెలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించడానికి వస్తున్నారు. జాతీయ జెండాను మన నియోజకవర్గంలోనే రూపకల్పన కూడా చేశారు. అలాంటి నియోజకవర్గం లో జాతీయ రహదారిపై జాతీయ జెండాలను చెత్తకుప్పలో వేసి అవమాన పరుస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి దృష్టికి తీసుకుని వెళ్లిన కానీ కనీసం పట్టించుకోని పరిస్థితి నెలకొన్నది.ఎవరో వాహనదారులు వేశారు లే అని కొట్టి పారేశారే తప్పా ఎలా జరిగిందో అని కూడా పరిశీలించ లేదు. అధికారులు జాతీయ జెండాకు కనీస గౌరవం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొన్నది. వాటిని చూసుకుంటూ రాష్ట్ర సరిహద్దుల్లో వందల వాహనాలు వెళుతున్నాయి.అధికారులు ఇప్పటికైనా స్పందించి జాతీయ జెండాను భద్రపరచాల్సిందిగా నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# బడి బయట విద్యార్థుల గుర్తింపుకు ప్రత్యేక సర్వే

**– ఒక్క విద్యార్థి కూడా బడి బయట ఉండకూడదు**

**– 6- 14 సం. విద్యార్థులందరూ పాఠశాలలో ఉండాలి**

**– జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సత్య శారదా దేవి**

**– విద్యార్థులను బడికి పంపడం ప్రతి ఒక్కరి బాధ్యత**



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): 6-14 సంవత్సరాల విద్యార్థులందరూ పాఠశాలల్లో చేరే విధంగా చూడాలని, పాఠశాలలో నమోదయి బడికి రాకుండా ఉండే విద్యార్థులను కూడా గుర్తించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ఈరోజు జిల్లా విద్యాశాఖ , కార్మిక శాఖ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ, పోలీసు శాఖలతో జరిపిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ జిల్లాలో ఈ నెలలో చేపట్టనున్న బడి బయటి విద్యార్థుల సర్వే పై ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతి పాఠశాలలో ఒక నెల కంటే ఎక్కువగా గైరహాజరు అయిన విద్యార్థులను గుర్తించి వారిని బడి బయట విద్యార్థులుగా ( ఓ ఎస్ సి ) విద్యార్థులుగా గుర్తించాలని ఆమె తెలిపారు. 15 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న విద్యార్థులు విద్యను ఆపివేస్తే వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యాభ్యాసం కొనసాగించడానికి ప్రేరేపించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు బడికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని, అలాగే విద్యార్థులందరినీ పాఠశాలలు ఆకర్షించే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరము బడిబాటి విద్యార్థుల గుర్తింపుకు సర్వే నిర్వహిస్తారని, అది డిసెంబర్ నెలలో మరియు జనవరి నెలలో నిర్వహించాల్సి ఉన్నందున సర్వే చేయవలసినటువంటి విద్యాశాఖకు సంబంధించిన ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సనల్ (%జ్రాం%) సంబంధిత ఆవాసములో ఉండే తల్లితండ్రులను, అంగన్వాడీ టీచర్లను, రిటైర్డ్ ఉద్యోగులను, యువజన సంఘాలను, భాగస్వాములు చేసుకోవాలని, గ్రామ సచివాలయ కార్యదర్శులు కూడా వీరికి సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్యసారదా దేవి తెలిపారు. సర్వే జరుగు విధానాలను, సర్వే జరుగుటకు అవసరమైన ప్రొఫార్మాలను, సూచనలను జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సమావేశంలో ఇతర అధికారులకు తెలియజేశారు. ఇటుక బట్టి ప్రాంతాలను, పని ఆవాసాలను, వలస వచ్చే కార్మికులు ఎక్కువగా ఉండే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రత్యేక సర్వే చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి డి.వాసంతి , గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, పోలీసు కమిషనరేట్ నుండి పి.వెంకన్న, మండల విద్యాశాఖ అధికారులు , తదితరులు ఈ సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేశి బ్యాచ్ ఇన్ పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): దేశి బ్యాచ్ లో 2024-25 సంవత్సరంలో శిక్షణ పొందుతున్న దేశీ బ్యాచ్ ఇన్పుట్ డీలర్లకు బుధవారం చుంచుపల్లి మండలం రామవరం రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజిల్లా వ్యవసాయ అధికారి బాబురావు డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్పుట్ డీలర్లకు బ్యాగులు మరియు ఆరు రిజిస్టర్లు 1)సమస్య పరిష్కార రిజిస్టర్ 2) పొలము సందర్శన రిజిస్టర్ 3) ప్రాంతాలవారి పంటల రిజిస్టర్ 4) అసైన్మెంట్ రిజిస్టర్ 5) రైతు విజయ గాధ రిజిస్టర్ మరియు 6) హెర్బెరియం రిజిస్టర్ లను డీలర్లు ఏ విధంగా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు మాట్లాడుతూ నత్రజని ఎరువు వాడకం మరియు (యూరియా ఎరువు) తగ్గించుకొనుటకు జీవన ఎరువు అజోల్ల వినియోగం గురించి డీలర్లకు వివరించారు. అజోల్లా జీవన ఎరువు గాలిలో ఉన్న నత్రజని గ్రహించి పొలంలో పంటకు అందజేయడం ద్వారా యూరియా ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. దేశీ సభ్యులకు మునగ సాగు వల్ల వచ్చే ఆర్థికపరమైన లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్ రావు, రంజిత్ కుమార్ మరియు దేశీ సభ్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

**ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి**




వరంగల్ జిల్లా, డిసెంబర్ 18 (తీన్మార్ న్యూస్): జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. రుణ లక్ష్యాలు బ్యాంకర్లు పూర్తి చేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో జిల్లాస్థాయి డీసీసీ, సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలకు గాను 1802.08 కోట్ల రూపాయలు రైతులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1231 కోట్ల రూపాయలు అందించారని వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 3785.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా సెప్టెంబర్ వరకు రూ.2136 కోట్లు అందించినట్టు తెలిపారు. భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 997.63 కోట్ల రూపాయలకు గాను రూ. 765 కోట్లు, ప్రాధాన్యత ఉన్న రంగాలకు రూ. 4891.15 కోట్లకు గాను రూ. 3008 కోట్లు అందించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు గాను రూ. 492 కోట్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2024 వరకు 9536 మంది లబ్ధిదారులకు 100 కోట్లు ముద్ర రుణాలు అందించినట్లు తెలిపారు. పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ ఎం ఈ, స్టాండ్ అప్ ఇండియా, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, విద్య విద్య రుణాల లాక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు, యూనియన్ బ్యాంకు డి ఆర్ హెచ్ మహేష్, ఆర్బీఐ ఏజీఎం పల్లవి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వ్యవసాయ అధికారి, పశుసంవర్ధక శాఖ బాలకృష్ణ జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మావల పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



ఆదిలాబాద్ టౌన్: వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ ను బుధవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సీఐ ఫణిదర్, మావల ఎస్ఐ వి.విష్ణువర్ధన్, ఎస్పికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీ చేతుల మీదుగా ఒక మొక్కని నాటారు.

స్టేషన్ సిబ్బంది ఏర్పటు చేసిన డ్రిల్ ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణను, పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ను పరిశీలించి ప్రతిరోజు పోలీస్ స్టేషన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి రిసెప్షన్, సాంకేతిక నిపుణుల పనితీరు, ఉమెన్ హెల్ప్ డెస్క్, సిబ్బంది వేచి ఉండు గది, స్టోర్ రూమ్, రికార్డు రూమ్ లను పరిశీలించారు. తదుపరి స్టేషన్ లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. స్టేషన్లో ఇప్పటివరకు నమోదైన సైబర్ క్రైమ్ బాధితుల వివరాలు, సిఈఐఆర్ ద్వారా తిరిగి అందించడం మొబైల్ ఫోన్ల వివరాలు, ఫింగర్ ప్రింట్, డ్రంక్ అండ్ డ్రైవ్, సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కిట్లు, కేసు హిస్టరీ సీట్లు, రౌడీ షీట్లు, ఫైవ్ ఎస్, రికార్డుల నిర్వహణ, డయల్ హండ్రెడ్, పెట్రో కార్, బ్లూ కోర్ట్, రౌడీ షీట్లు తదితరాలపై పూర్తి విచారణ చేపట్టారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటిని అరికట్టాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఆసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకొని ఉండాలని సూచించారు. సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించినప్పుడు ఎలాంటి నేరాలు జరగకుండా, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పవర్ గౌతమ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ ప్రవేశపెట్టాలి

**- ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం**
**- పట్టణాలు, నగరాల్లో కొత్త స్కూళ్లను ప్రారంభించాలి : మండలి మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి**



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శాసనమండలి ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ మండలిలో విద్యారంగంపై సంపూర్ణంగా చర్చ జరిగినట్టుగా అనిపించడం లేదన్నారు. ప్రతిపక్షంలో ఏ పార్టీ ఉంటే ఆ నాయకులు వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 1,881 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని వివరించారు. 2022-23 విద్యాసంవత్సరంలో 1,461 స్కూళ్లు మూతపడ్డాయని చెప్పారు. ఏటా మూతపడుతున్నాయనీ, ఎందుకు పడుతున్నాయో ప్రతిపక్షం, అధికార పార్టీ ఆలోచించడం లేదన్నారు. విద్యా ప్రయివేటీకరణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి, సకాలంలో ఉపాధ్యాయ నియామాలు చేపట్టకపోవడం, ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వస్తున్నారని వివరించారు. ఈ కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటా తగ్గుతున్నదని అన్నారు. అందుకే ఏటా బడులు మూతపడుతున్నాయని చెప్పారు. అయితే పట్టణాలు, నగరాల్లో జనాభా పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించడం లేదన్నారు. 2014-15లో ప్రభుత్వ పాఠశాలల్లో 31.60 (51 శాతం) లక్షల మంది విద్యార్థులు చదివితే 2025-25లో 24.50 (42 శాతం) లక్షల మంది విద్యార్థులకు పడిపోయిందన్నారు. అదే సమయంలో ప్రయివేటు పాఠశాలల్లో 2014-15లో 49 శాతం విద్యార్థులుంటే, ప్రస్తుతం 58 శాతం మంది పిల్లలు చదువుతున్నారని వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో 1.50 లక్షల మంది చదివితే, ప్రయివేటు పాఠశాలల్లో నాలుగు లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. కేజీ తరగతులను ప్రవేశపెట్టకపోతే ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కిలో బియ్యం 77 శాతం ప్రజలు తీసుకుంటున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం 42 శాతం పిల్లలే ఉంటున్నారని వివరించారు. 35 శాతం మంది ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నా ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌లో ఎనిమిది లక్షల మంది, ములుగులో 40,500 మంది, రంగారెడ్డి జిల్లాలో 7.60 లక్షల మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 6.30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పది జిల్లాల్లో లక్షలోపు విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. పట్టణాలు, నగరాలకు ప్రజలు వలస పోతున్నారని చెప్పారు. అక్కడ కొత్త స్కూళ్లను ప్రారంభించాలని సూచించారు. అమెరికా, ఇంగ్లాండ్, నార్వే, ఫిన్లాండ్ వంటి దేశాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. భారత్‌లోనే ప్రయివేటు బడుల్లో ఎక్కువ చదువుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారనీ, 10,006 మంది కొత్త టీచర్లకు నియామకపత్రాలను అందించారని చెప్పారు. పాఠశాల గ్రాంట్‌ను ఇస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 30 మందిలోపు ఎనిమిది వేలు, 50 మందిలోపు 14 వేలు ఉన్నాయని వివరించారు. ఉన్న టీచర్లు, వనరులతోనే ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయొచ్చని సూచించారు. విద్యారంగంలో రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. గురుకులాలు, కేజీబీవీలు పెట్టినా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని అన్నారు. విద్యారంగంపై స్వల్పకాలిక చర్చ జరగాలని కోరారు.

# రాబోయేది ప్రజా పోరాటాల కాలమే..

**- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్..**




భువనగిరి కలెక్టరేట్ : ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహించనున్నట్లు, రాబోయేది ప్రజా పోరాటాల కాలమే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ తెలిపారు. బుధవారం ఆయన సుందరయ్య భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభలు డిసెంబర్ 15 ,16, 17 తేదీలలో చౌటుప్పల పట్టణంలోని ఎస్ఎం రెడ్డి ఫంక్షన్ హాల్ లో 320 మంది ప్రతినిధులతో అత్యంత ఉత్సాహపూరితంగా జిల్లా మూడవ మహాసభలు నిర్వహించుకుని మహాసభలలో ప్రజా సమస్యలపై, జిల్లా సమగ్రాభివృద్ధిపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలను చేయడం కోసం సీపీఐ(ఎం) ముందుంటుందని అన్నారు. రాబోయేది ప్రజా పోరాటాల కాలమే అని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా మూడవ మహాసభలలో జిల్లా సమగ్రాభివృద్ధి చిన్న నీటి ప్రాజెక్టులు, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే పరిశ్రమలపై, కార్మికుల కనీస వేతనాలు, విద్యా ఉపాధి వైద్యం, మహిళా సంరక్షణ, వ్యవసాయ రైతు సమస్యలపై అనేక తీర్మానాలు భవిష్యత్ కార్యాచరణ తీసుకున్నామని వారు అన్నారు. రామన్నపేట మండలంలో నిర్మించే తలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సీపీఐ(ఎం) శ్రీకారం చుట్టబోతుందని, సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ఉండే అనేక గ్రామాలు, వ్యవసాయం, చేతివృత్తులు, పాడి పరిశ్రమ, ప్రజల ఆరోగ్యం దెబ్బతిని రామన్నపేట మండలం మొత్తం నోమ్ జోన్ గా మారే పరిస్థితి వస్తుందని అన్నారు.

దీనిపై మహాసభలలో ప్రత్యేక తీర్మానాన్ని పెట్టి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించామని వారు అన్నారు. అదేవిధంగా జిల్లాను పట్టిపీడిస్తున్న మూసి ప్రక్షాళన గోదావరి జలల సాధన కోసం, బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తి కోసం ఇంకా ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలని పోరాటం, త్రిబుల్ ఆర్, భద్రాచలం, గౌరెల్లి భూ నిర్వాసితుల పోరాటం, రాచకొండ భూములు స.నెం 273,106,96 లలో అనేక మంది పేద రైతులు 1000 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులందరికి పట్టా పాస్ పుస్తకాల కోసం పోరాటం తీసుకుంటామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, చిన్న నీటి ప్రాజెక్టులైన పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహార్ కాలువల పూర్తి కోసం ప్రజా పోరాటాలు తీసుకుంటామని వివిధ రంగాలలో పనిచేసే ప్రతి కార్మికునికి కనీస వేతనం 26,000 రూ. ల కోసం కార్మిక ఉద్యమాలు, మహిళలపై జరుగుతున్న హింస, దారుణాల పై ఆందోళన పోరాటాలు నిర్వహించి జిల్లాలో ప్రతిపక్ష పార్టీగా సీపీఐ(ఎం)ను మరింత ముందుకు తీసుకుపోతామని సీపీఐ(ఎం) చేసే ప్రజా పోరాటాలలో ప్రజలందరూ భాగస్వాములు అయ్యే విధంగా సీపీఐ(ఎం) శ్రేణులు, నాయకత్వం గ్రామాలలో ప్రజా సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తుందని రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) సత్తా చాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలం అంతా ప్రజా పోరాటాల కాలనీ అని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, నాయకులు వనం రాజు, వల్లభుదాసు రాంబాబు లు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**- ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి**
**- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె**



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. మంగళవారంతో ఎనిమిది రోజులు పూర్తయ్యింది. మంగళవారం హైదరాబాద్‌లోని సమ్మె శిబిరంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలోని ఏకశిల పార్క్ దీక్షా శిబిరంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రీఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని సూచించారు. ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలనీ, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడం వల్ల ఎంఈవో, డీఈవో కార్యాలయాలు మూతపడ్డాయని అన్నారు. విద్యాశాఖ పరిపాలన పూర్తిగా స్థంభించిపోయిందన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో బోధన కొనసాగడం లేదన్నారు. పాఠశాల విద్యాశాఖలో యూడైస్, అపార్, మధ్యాహ్న భోజనం ఆన్‌లైన్ పనులు కుంటుపడ్డాయని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంఘ నాయకులను పిలిచి చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయ్యాలని కోరారు. పే స్కేల్ అమలు చేస్తామంటూ అసెంబ్లీలో ప్రకటన చేయాలన్నారు. తమ సమస్యలు తీర్చే వరకు సమ్మె కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ చారి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సహాదేవ్, సురేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, జానకి రామ్, కనుకుల రమేష్ , రాష్ట్ర కార్యదర్శి సత్య నారాయణ, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలి

**- పుల్లూరి సింహాద్రి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు..**




సూర్యాపేట కలెక్టరేట్: వరుసగా విద్యార్థుల ఆత్మహత్య లకు కారణం అవుతున్న నారాయణ, విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా మారి విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటుంది. విచ్చలవిడిగా ఏర్పాటు అయిన కార్పోరేట్ నారాయణ విద్యాసంస్థల దోపిడీ వ్యవహారం పేద, మధ్య తరగతి విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని వారి వద్ద లక్షల రూపాయలు దండుకుంటునాయి అని అన్నారు.ఇలాంటి కార్పోరేట్ వ్యవస్థలు ఆర్థికంగ, మానసికంగ విద్యార్థులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి అని ఆవేదన వ్యయక్తం చేశారు.ఉజ్వల భవిష్యత్ ఉండాల్సిన నవ యవ్వన బాల మొగ్గలని, ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నాయి అన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు చనిపోతున్నారని అయినా కూడా ఈ ప్రభుత్వం ఈ విద్యాసంస్థలు వేసే కుక్క బిస్కెట్ల మీద ఆశపడి, ఆధారపడడం వలన వీటి మీద నియంత్రణ కరువైంది అన్నారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించేందుకు ఫీజుల నియంత్రణ కమిటీ లేదా చట్టాన్ని తీసుకొచ్చి సంస్థల అన్నిటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నారాయణ విద్యా సంస్థలను రద్దు చేయాలని అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నారాయణ, దోపిడి విద్యా సంస్థల నిర్వాహకులు నిబంధలకు విరుద్ధంగా సెలవు రోజు కూడా ప్రత్యేక తరగతులు కొనసాగిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు అని తెలిపారు.దీనిపైన తక్షణమే జిల్లా విద్య ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయంపై బాలల హక్కుల సంఘం కూడా జోక్యం చేసుకొని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు మహేష్ నవీన్ పవన్ వినయ్ ప్రవీణ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా వెళ్ళే విద్యార్థులకు శుభవార్త..




వాషింగ్టన్: అమెరికా వెళ్లాలని, అక్కడ ఉద్యోగాలు చేయాలని కలలు కనే భారతీయులకు జో బైడెన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశీ నిపుణులను మరింత సులభంగా నియమించుకునే అవకాశాన్ని అక్కడి కంపెనీలకు కల్పిస్తూ నిబంధనల్లో మార్పులు చేసింది. అలాగే, ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ఫలితంగా లక్షలాదిమంది భారతీయ ప్రొఫెషనల్స్‌కు ప్రయోజనం చేకూరనుంది. అమెరికాలోని ఐటీ కంపెనీలు హెచ్-1బీ వీసా (నాన్ ఇమిగ్రెంట్) సాయంతో విదేశీ నిపుణులను నియమించుకుంటాయి. ఈ వీసా ద్వారా భారత్, చైనా దేశాలు భారీగా లబ్ధి పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ నిబంధనల్లో మార్పులు చేసి అవసరాలకు తగ్గట్టుగా విదేశీ ఉద్యోగులను నియమించుకునే అవకాశాన్ని అక్కడి కంపెనీలకు కల్పించింది.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే వెరీ స్లో.?


**- సర్వర్ మొరాయింపుతో ఇబ్బందులు**
**- ఆందోళనలో లబ్ధిదారులు**



మల్హర్ రావు: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇటీవల నిర్వహించిన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మండలంలోని 15 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 8,936 దరఖాస్తులు ప్రజలు ఇచ్చారు.ఈ నెల 11 నుంచి 31 వరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయం 7 గంటలకే చేరుకొని సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నారు.ఇప్పటివరకు సేకరించిన వివరాలు ప్రత్యేక యాప్లో ఎప్పటికప్పుడు పొందుపరుస్తున్నాను.సర్వే యాప్ మొరయించడంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మందకొడిగా వెరీ స్లోగా కొనసాగుతోంది.ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రత్యేక యాప్ సర్వర్ ప్రాబ్లమ్ తో ఓపెన్ కాక సర్వే నిలుస్తోంది.దీంతో ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులు పెట్టుకున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.ఈ నెల 11 నుంచి ప్రారంభమైన సర్వేలో భాగంగా ఇప్పటి వరకు అన్ని గ్రామాల్లో అధికారులు 320 ఇళ్ల సర్వేలు నిర్వహించి దరఖాస్తులు పరిశీలించారు.పరిశీలించిన దరఖాస్తులను ప్రత్యేక యాప్లో నమోదు చేస్తున్నారు.సర్వర్ ఇలాగే ఉంటే తుడిగదువులోగా సర్వే పూర్తి చేయడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు.

# అసెంబ్లీలో తొలి ప్రసంగంలోనే ప్రజా సమస్యల ఊసు..

**- సాగునీరు,రవాణా సౌకర్యం పై కల్పించాలని వినతి**
**- మంత్రులు పొంగులేటి,తుమ్మల ప్రస్తావన తో ఎమ్మెల్యే జారే చాణక్యం**



అశ్వారావుపేట: అసెంబ్లీలో తొలి ప్రసంగంలో నే దీర్ఘకాలిక సమస్యలు, మంత్రి తుమ్మల, పొంగులేటి పేర్లు ప్రస్తావన తో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చాణక్యం ప్రదర్శించారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడే అవకాశాన్ని నియోజక వర్గం మేలు కోసం కేటాయించారు. మాట్లాడే అవకాశం ఇచ్చిన స్పీకర్ కు ధన్యవాదాలు తెలుపుతూనే.. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిన తన ఓటర్లకు పాదాభివందనం అంటూ ఓటర్లు పై తన వాత్సల్యాన్ని చూపించారు. తన నియోజక వర్గంలో ఉన్న వెంగళరావు, మూక మామిడి, పెద్దవాగు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, రైతులకు సాగునీరు అందించేందుకు శాస్వత పరిష్కారం చూపాలని నీటి పారుదల శాఖ మంత్రి కోరారు. ఏజన్సీ నియోజకవర్గం అయిన అశ్వారావుపేట పలు గ్రామాలకు నేటి సరైన రవాణా సౌకర్యాలు లేనందున కావడి గుండ్ల లాంటి మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. పెద్దవాగు కు గండి పడిన సమయంలో రెవిన్యూ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రులు చూపిన చొరవ, పరిపాలనా పరం అయిన సహాకారం ను అసెంబ్లీలో ప్రస్తావించి వారి మన్ననలు ను సొంతం చేసుకున్నారు. చదువరి అయిన వ్యక్తిగా ఎమ్మెల్యే ఆదినారాయణ తన నైజం ప్రదర్శించారని పలువురు అభిమానులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మహత్యలు ఎస్పీని కదిలించాయి..

**- బాసర గోదావరిని పరిశీలించిన జిల్లా ఎస్పీ..**



ముధోల్: భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర పుణ్యక్షేత్రంలో గల గోదావరి నదిలో తరచు ఆత్మహత్యలు జరగటంతో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ను కదిలించాయి. దీంతో బుధవారం బైంసా ఎ ఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సిఐ మల్లేష్, బాసర ఎస్ఐ గణేష్ తో కలిసి బాసర గోదావరి బ్రిడ్జి, స్నానపు ఘాట్లను పరిశీలించారు. వివిధ కారణాలతో కొంతమంది గోదావరిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బ్రిడ్జి సైడ్ వాల్ ఎత్తుగా లేకపోవడంతో గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఎస్పీ బ్రిడ్జి సైడ్ వాల్ కు ఇనుప కంచె ఎత్తుగా బిగించాలని నిర్ణయించారు. అయితే ఈ బ్రిడ్జి నిజామాబాద్, నిర్మల్ జిల్లాకు పరిధిలో ఉండటంతో నిజామాబాద్ పోలిస్ కమిషనర్ సమన్వయంతో ఇరుపక్కల బ్రిడ్జికి ఇనుప కంచె ఏర్పాటు చేస్తామని ఎస్పీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఆత్మహత్యలను నివారించడానికి తీసుకోవలసిన చర్యల గురించి ఎస్పి పోలీసులతో సమీక్షించారు. అలాగే బ్రిడ్జి దగ్గర, స్నానపు ఘాట్లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి బాసర పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. గోదారి బ్రిడ్జి వద్ద, స్నానపు ఘాట్లుల వద్ద మహిళా కానిస్టేబులను నియమిస్తామన్నారు. నిరంతరం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. ఆత్మహత్యలు నివారణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఏదేఏమైనా ఆత్మహత్యల నివారణకు ఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

**- 15 సార్లు కొరికిన ఎలుకలు**

**- ఎలుకలు కొరికిన ప్రతిసారి వ్యాక్సిన్**

**- రెండు కాళ్లూ చచ్చుబడి మంచానికే పరిమితం**

**- తరుచూ వ్యాక్సిన్ వల్లే కాళ్లు చచ్చుబడినట్టు అనుమానాలు**

**- ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో వైద్యచికిత్సలు**



ఖమ్మం: ఖమ్మం దాన్వాయిగూడెంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తి (15)ని గత రెండు నెలల నుంచి 15 సార్లు ఎలుకలు కొరికాయి. పలుమార్లు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందింది. వారం రోజుల క్రితం తన కాళ్లు, చేతులు లాగుతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఖమ్మంలోని మమత జనరల్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఆమె రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయని వైద్యులు చెప్పారు. కొన్ని నెలల క్రితం నుంచి ఎలుకలు కొరికిన ప్రతిసారీ వ్యాక్సిన్ వేయిస్తుండటం వల్లనే విద్యార్థిని కాళ్లు పడిపోయాయని అనుమానిస్తున్నారు. 15 సార్లు లక్ష్మీ భవాని కీర్తిని ఎలుకలు కొరకగా 15 వాక్సిన్‌ల వరకు వేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా బాధిత విద్యార్థిని లక్ష్మీభవానీకీర్తి మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఎలుకలు బాగా ఉన్నాయని, ప్రతిరోజూ ఎవరినో ఒకర్ని కొరుకుతున్నాయని తెలిపారు. హాస్టల్ వాతావరణం కూడా అంత బాగోలేదని, అపరిశుభ్రతతోనే ఎలుకలు ఎక్కువయ్యాయన్నారు. ఈ విషయంపై పర్యవేక్షకులకు కంప్లైంట్ చేస్తే పట్టించు కోవడం లేదని, పైగా ఉంటే ఉండండి.. లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండని అంటున్నారని వాపోయారు. కాగా, ఆ విద్యార్థిని ఆరోగ్యపరిస్థితి గమనిస్తే కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థినిని ఎలుకలు కరుస్తున్నాయని బీఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో గురుకుల, రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై పెట్టిన శ్రద్ధ నేడు కనిపించడం లేదన్నారు.

# అంగన్వాడి కేంద్రాలు మరింత మెరుగ్గా నిర్వహించాలి

**- గర్భిణీ ల ఆరోగ్యాన్ని రెగ్యులర్ గా మానిటర్ చేయాలి**

**- పోషక లోపం గల పిల్లలకు బాలామృతం ప్లస్ సరఫరా చేయాలి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి ప్రతినిధి: జిల్లాలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్ వాడి కేంద్రాల పనితీరు, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు లబ్ధిదారుల వివరాలు, ప్రీ స్కూల్ నిర్వహణ, అనేమియా నివారణ మొదలగు వివరాలను కలెక్టర్ సంక్షేమ అధికారి అడిగి తెలుసుకున్నారు. నెలలో ఎన్ని అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు, అక్కడ గమనించిన పరిస్థితులు మొదలగు వివరాలను కలెక్టర్ సూపర్వైజర్ లను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రాల నిర్వహణ మరింత మెరుగు కావాల్సిన అవసరం ఉందని, పిల్లలకు యూనిఫామ్ ఎక్కడా కనపడలేదని, అంగన్ వాడి టీచర్లు సమయపాలన పాటించడం లేదని, కేంద్రాల నిర్వహణ శుభ్రంగా లేదని, ఈ పరిస్థితుల్లో వెంటనే మార్పులు రావాలని కలెక్టర్ సూపర్ వైజర్ లకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలను సకాలంలో ఓపెన్ చేయాలని, పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయాలని, పిల్లలు శుభ్రంగా ఉండాలని, బురద, చెత్త లో ఆడుకుంటున్నట్లు పిల్లలను గమనిస్తే టీచర్ల నుంచి సూపర్ వైజర్, సిడిపిఓ వరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. సామ్, మాల్ న్యూట్రిషన్ సంబంధించి వాస్తవిక పరిస్థితులు రిపోర్ట్ చేయాలని, ఎంత ఎక్కువ మంది గుర్తిస్తే అంత మంచిదని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకుంటున్నారో లేదా, ఐరన్ మాత్రలు వేసుకుంటున్నారా అనే అంశం పై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, గర్భిణీ మహిళలకు సంబంధించి ప్రతి అంశాన్ని ట్రాక్ చేసుకునేలా అంగన్వాడీ కేంద్రాల వద్ద వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్, చెక్ అప్ సకాలంలో జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రీ స్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని, అంగన్ వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుద లను రెగ్యులర్ గా పరీక్షించాలని, పిల్లలకు యూనిఫామ్ సరిగ్గా ఉండాలని, ప్రతి సూపర్ వైజర్ పరిధిలో ఉన్న అంగన్ వాడి కేంద్రాల సమస్య లు చర్చల ద్వారా పరిష్కరిం చాలని, అనవసరమైన ధర్నాలకు ఆస్కారం ఇవ్వవద్దని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను 100% మానిటరింగ్ చేయాలని, పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. అంగన్ వాడి కేంద్రాలలో గుడ్లు, బాలామృతం ప్లస్ కు ఎటువంటి లోటు రాకుండా చూసుకోవాలని అన్నారు.

పోషణ లోపంతో ఎత్తు తక్కువ, బరువు తక్కువ గల పిల్లలను గుర్తించాలని, వారి కోసం నిర్దేశించిన సూపర్వైజడ్ సప్లిమెంట్ ఫీడింగ్ ప్రోగ్రాం సంబంధించిన వీడియోలు గ్రూపులలో షేర్ చేస్తూ, ఆ కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని అన్నారు. సంక్రాంతి నాటికి జిల్లాలో అనాథ శరణాయాలకు, అనాథ పిల్లలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను సేకరించి నివేదిక అందించాలని కలెక్టర్ అన్నారు. ఆర్.బి.ఎస్.కే వైద్యుల వచ్చి వైద్య పరీక్షలు నిర్వసిస్తున్నారా, పిల్లలకు ఎవరికైనా గుండె సంబంధిత జబ్బులు మొదలగు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని పిల్లలకు మెరుగైన వైద్యం తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రంగంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సఖి కేంద్రం భవనాన్ని కలెక్టర్ సందర్శించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి , జనవరి 1 నూతన సంవత్సరంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈఈ పంచాయతీ రాజ్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ రెసిడెన్షి యల్ హాస్టల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. సుల్తానాబాద్ లో నిర్మాణం అవుతున్న వృథాశ్రమం, బాలల సదనం పనులు పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో ఈఈ పంచాయతీ రాజ్ గిరిష్ బాబు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెలవులు పెడితే పేషెంట్ల పరిస్థితేంటి..?

**- కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం**

**- రామన్నపేట ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ**



రామన్నపేట: ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిన వారు ఎక్కువ మంది సెలవులు పెడితే.. పేషంట్లకు వైద్యం ఎవరు చేస్తారంటూ యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలపాటు ఆస్పత్రి మొత్తం కలియదిరిగారు. ప్రతి పేషెంట్‌నూ కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ దగ్గర ఉన్న పేషెంట్లతో మాట్లాడి.. అక్కడికక్కడే వైద్యులకు చెప్పి సంబంధిత వైద్యం చేయించారు. కొంతమంది పేషెంట్ల విషయం ఆరోగ్యశ్రీ విభాగం వారికి అప్పజెప్పి.. మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అటెండెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి ఒక్కో ఉద్యోగి గురించి పరిశీలించారు. లీవ్ లెటర్లు ఉన్నాయని తెప్పించుకొని పరిశీలించారు. సుమారు 60శాతం ఉద్యోగులు సెలవులో ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వారు సెలవులు పెట్టారని, అంతగా ప్రాముఖ్యత లేని వారు డ్యూటీలో ఉన్నారని తెలిపారు. లీవ్ లెటర్లలోని సంతకాలు వారివేనా అని ప్రశ్నించారు. రిజిస్టర్‌లో ఒకరకంగా.. సెలవు చీటీలపై మరో రకంగా ఉండటంపై ఆరా తీశారు. గైనకాలజిస్ట్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఫోన్‌లో డీసీహెచ్ఎస్‌తో మాట్లాడారు. వెంటనే ఇక్కడ గైనకాలజిస్టును నియమించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఫుడ్ కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి నాణ్యమైన పౌష్టికాహార భోజనాన్ని పెట్టాలని సూచించారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో మిషన్ భగీరథ ఉద్యోగులను పిలిపించి వెంటనే నీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. హెచ్పీసీఎల్ అధికారులతో మాట్లాడి రెండు వాటర్ ఫిల్టర్‌లను అందించాలని కోరారు.

# శరవేగంగా సాగుతున్న సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు

హైదరాబాద్: రానున్న వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్ కు తగ్గట్టు విద్యుత్ సరఫరా కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ తగు చర్యలు చేపట్టింది. సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా జరుగుతున్న పనులను తనిఖీ చేసారు. మేడ్చల్ పరిధిలో బౌరంపేట్ లో నిర్మితవుతున్న 132 కేవీ సబ్ స్టేషన్ ను, టవర్ నిర్మాణ పనులు తనిఖీ చేసిన సీఎండీ, బౌరంపేట్ 33 / 11 కేవీ సబ్ స్టేషన్ లో అదనంగా ఏర్పాటు చేసిన 8 ఓఎం పవర్ ట్రాన్స్ ఫార్మర్ ను ప్రారంభించారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో 35 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, హబ్సి గూడ సర్కిల్ పరిధిలో 90 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 14 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 14 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 545 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో 127 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 4 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 25 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 232 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో 49 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 7 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 23 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 309 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, బంజారా హిల్స్ సర్కిల్ పరిధిలో 46 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 73 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో 67 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 9 33 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 24 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 171 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో 18 11 కేవీ ఫీడర్ల విభజన/ఇంటర్లింకింగ్, 6 పవర్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు, 137 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్ల స్థాయి పెంపు/ అదనంగా ఏర్పాటు వంటి వివిధ పనులు చేపట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ వినియోగం గతేడాది ఎండా కాలంతో పోల్చుకుంటే గణనీయంగా పెరుగుతున్నది. గతేడాది 3756 మెగావాట్లుగా నున్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 % వృద్ధి తో 4352 మెగావాట్ల గా నమోదయ్యింది, గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా నున్న వినియోగం దాదాపు 12 % వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగారికార్డు స్థాయిలో గణనీయమైన వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు. డిమాండ్ ఎంతగా పెరిగినా సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశాలనుసారం, విద్యుత్ సంస్థలయాజమాన్యాలు,అధికారులు సిబ్బంది సెక్షన్ స్థాయిలో డిమాండ్ ను చేస్తూ తగు ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నం అయి వున్నారు.

# విద్యామంత్రిని నియమించాలి

**- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి**



హైదరాబాద్: విద్యాశాఖకు మంత్రిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏండ్లు గడుస్తున్నా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని విమర్శించారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నరసింహారావు, ఎస్ అనిల్, ఎమ్ నరేందర్, భాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, సాయి, కోశాధికారి సురేష్, రాష్ట్ర నాయకులు వి వెంకటేష్, రాకేష్, సీతారాం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై అనుమానాలు

**- విచారణ జరిపి కుట్రలను బయటికి తీస్తాం**

**- ఆ సెక్రెటరీ బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు**

**- ఆ పార్టీ నాయకులు పాత ట్వీట్‌లు చూసుకోండి : మంత్రి సీతక్క**



హైదరాబాద్: గురుకులాలు, హాస్టళ్లు, విద్యాలయాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై కుట్రలు ఉన్నట్టు తమకు అనుమానాలున్నాయని మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విషయంపై బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి సిరికొండ తదితరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గురుకులాల కార్యదర్శిగా గతంలో పని చేసి బయటికి వచ్చాక ఆ అధికారి వరస ట్వీట్‌లతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ఘటనలపై విచారణ జరిపించి నిజాలను బయటికి తీస్తామని తెలిపారు. దీంతో తమ పేర్లను మంత్రి ప్రస్తావిస్తున్నారంటూ బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్‌రావు అభ్యంతరం తెలుపగా, మంత్రి తానెవరి పేర్లు ప్రస్తావించలేదనీ, విచారణ అంటే భుజాలెందుకు తడుముకుంటున్నారని ఎదురు ప్రశ్నించారు. అంతకు ముందు మధుసూదనాచారి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సమస్య తీవ్రంగా ఉందనీ, ఏడాదిలో 800 మంది ఫుడ్ పాయిజనింగ్‌కు గురికాగా, 53 మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా నలుగురైదుగురు మరణిస్తున్నారని చెప్పారు. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థినిని అనేక ఆస్పత్రుల చుట్టూ తిప్పారనీ, మీడియాను కవర్ చేయనీయకుండా ఫెన్సింగ్ వేశారనీ, నేను రాను బిడ్డో ఆశ్రమ పాఠశాలకు అనే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ఒక ఐపీఎస్ అధికారి ఐదేండ్లపాటు గురుకులాల్లో కార్యదర్శిగా ఉంటూ ఒక సొంత సంస్థ ద్వారా సామ్రాజ్యం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. దీంతో గురుకులాల్లో జరుగుతున్న వాటిపై అనుమానాలు వస్తున్నాయని చెప్పారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏసీబీతో విచారణ జరిపించాలనీ, పేద పిల్లల జీవితాలతో ఎవరు ఆటలాడుతున్నారో బయటికి వెలికి తీయాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క బదులిస్తూ, గతంలో కూడా అనేక మరణాలు జరిగాయని తెలిపారు. వాంకిడి విద్యార్థినీ శైలజ మరణం చివరి మరణం కావాలని ఆకాంక్షిం చారు. నిత్యావసర, ఆహార పదార్థాల సరఫరాదారులపై నిఘా పెట్టాల్సి ఉందన్నారు. గురుకులాలకు, ఆశ్రమ పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ లేదన్న బీఆర్ఎస్ సభ్యుల వాదనలో నిజం లేదనీ, ఐదో తరగతిలో చేరేందుకు 78 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. శైలజకు మెరుగైన చికిత్సనం దించామనీ, ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యవేక్షిం చారనీ, కుటుంబానికి ఇల్లు, తండ్రికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చినట్టు తెలిపారు. తాను కూడా ములుగు గర్ల్స్ హాస్టల్ విద్యార్థినీ తనకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పారు. సెక్రెటరీగా పని చేసిన తర్వాత ఆ అధికారి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేసి అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాదిలో 386 ఫుడ్ పాయిజన్, 2 పాముకాటు, 2 ఎలుక కరిచిన ఘటనలు జరిగాయని చెప్పారు. ఏండ్ల తరబడి పెంచని డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచిందని సీతక్క తెలిపారు.

# ఇక్కడ మెడిసిన్ చేసిన వాళ్లు స్థానికులే

**- 148,149 జీవోలు చెల్లవు : హైకోర్టు**



హైదరాబాద్: తెలంగాణలో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ(ఎంబీబీఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదం మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్), బ్యాచిలర్ ఆఫ్ హౌమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) కోర్సులు పూర్తి చేసిన వాళ్లు స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో 'స్థానికులు'గా పరిగణించాలంది. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే అడ్మిషన్‌లు కల్పించాలని తేల్చి చెప్పింది. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని పేర్కొంది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు సవరణ తీసుకువచ్చే అధికారం ఉందనీ, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణ స్థానికతతో ఇతర ప్రాంతాల్లో ఇదే కోర్సులు పూర్తి చేసిన వారిని కూడా 'లోకల్' కిందే కౌన్సిలింగ్ నిర్వహించాలంది. అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాక నిబంధనలను మార్పు చేయడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 148, 149లను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది. ఈ జీవోలు చట్ట వ్యతిరేకమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత వంటి వాటిని ధర్మాసనం తన తీర్పులో ఉదహరించింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్ల) నిబంధనలు 2021లోని రూల్ 8(2)ను, తెలంగాణ అడ్మిషన్ పోస్టుగ్రాడ్యుయేట్ (ఆయుష్) కోర్సుల నిబంధనలు 2024లోని రూల్ 8 (2)ను ప్రభుత్వం సవరించింది. గత అక్టోబర్‌లో 28న 148, 149 జీవోలను జారీ చేసింది. ఈ జీవోలు చట్టవిరుద్ధమని తీర్పులో పేర్కొంది. ఇదే హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని తేల్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థిస్తూ గత సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులు 1974ను ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కి కూడా జీవో 72 విరుద్ధం కాదంది.

పీజీ మెడికల్ అడ్మిషన్ల రూల్స్‌ను మార్పు చేయడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రజిత, మంచిర్యాలకు చెందిన సత్యనారాయణ, స్థానికత వ్యవహారంపై సుమారు వంద మంది వేర్వేరుగా వేసిన పిటిషన్లపై హైకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది.

# హక్కుల సాధన కోసం లక్ష డప్పులు, వెయ్యి గొంతులతో కవాతు

పెద్దపల్లి ప్రతినిధి: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ జెండా పట్టుకుని మందకృష్ణ మాదిగ పోరాడు తున్నారని, వారు చేపట్టిన కవాతుకు మద్దతుగా మాదిగలంతా సహకరించాలని ప్రజా గాయకుడు రామంచ భరత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లాకు చెందిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశాన్ని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజా కళా నాయకుడు రామంచ భరత్ మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు వర్గీకరణకు మద్దతు తెలిపాయన్నారు. ఎస్సీలలో ఉన్న 59 కులాల్లో కేవలం ఒక కులం మాత్రమే వ్యతిరేకంగా ఉందని అన్నారు. అన్ని ఉద్యమాల్లో, రాజకీయ పార్టీల గెలుపు ఓటములలో మాదిగ కళాకారుల పాత్ర ఉందని అన్నారు. ఎన్నో మంచి చెడులలో, ఎందరికో డప్పు కొట్టి పాట పాడామని, ఇప్పుడు మొట్టమొదటిసారిగా తమ హక్కుల సాధన కోసం డప్పులు కొట్టబోతున్నామ న్నారు. ఈనెల 27 నుంచి జనవరి 27 వరకు లక్ష డప్పులు వెయ్యి గొంతుల కళానాయకుల కవాతు కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభించను న్నారని తెలిపారు. ఎమ్మెస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాట్లాడుతూ ఈ కవాతు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, మాదిగ మేధావులు, ఉద్యోగులైన జాతి బిడ్డలను గౌరవించుకుంటూ వారిని సన్మానం చేస్తామని అన్నారు. అలాగే అమరులైన మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చేస్తానని హామీ ఇవ్వడంతో బలమైన ఆకాంక్షను తెలియజేసేందుకు మొదటిసారి తమ హక్కుల కోసం డప్పు కొట్టబోతున్నట్లు తెలిపారు.




అందుకోసం ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా పరిధిలోని మాదిగలు, మాదిగ ఉపకులాల కళానాయకు లంతా విధిగా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుండా థామస్, మహా ప్రదర్శన రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్ కుమార్, ఏంఎస్ పీ జిల్లా అధ్యక్షులు మంథని చందు, రాష్ట్ర నాయకులు అంబాల రాజేందర్, వడ్డేపల్లి బాలన్న డప్పు కళాబృందాల పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి, మడిపల్లి దశరథం, జిల్లా ప్రధాన కార్యదర్శి,కన్నూరి అంజు ప్రజా గాయకుడు, ఏట రవన్న ప్రజా గాయకుడు, గాజుల రమేష్ గోదావరి కళా సంఘాల జాయింట్ సెక్రెటరీ, అగ్గిమల్ల కొమురయ్య డప్పు కళా సంఘాల నాయకులు, ప్రజా గాయకులు, తూండ్ల రాజన్న, సిరిసిల్ల శంకర్ మాదిగ, బర్ల తిరుపతి, వడ్లకొండ రవి వర్మ, కొండ్ర సునీత, ఏట మమత, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి పొట్ల రమేష్, మామిడి విష్ణు, అక్కపాక మహేష్, ఏట సంపత్ మాదిగ, డప్పు కళాకారుడు గడ్డం రామచంద్రం, దూడపాక సతీష్, ఆది జాంబవుని డప్పు కళాబృందం నాయకులు , చిలుముల వెంకటస్వామి ఆది జాంబవంతుని డప్పు కళాబృందం అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

# నిరుపేదలను గుర్తించే పనిలో సర్కార్

హైదరాబాద్: తెలంగాణలో భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం ఇవ్వబోతున్నట్టు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. రెండు విడతలుగా ఇచ్చే సాయం తొలి దఫా నిధులు ఆరు వేల రూపాయలను ఈ నెల 28న విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28ని నిధుల విడుదలకు ముహూర్తంగా ఎంచుకున్నారు. భూమి ఉన్న రైతులకు ఇప్పటికే ఏటా 12 వేల రూపాయాలను ప్రభుత్వం ఇస్తోంది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీన్ని సంక్రాంతి నుంచి ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది. అంత కంటే ముందు భూమి లేని రైతులకు సాయం చేయాలని భావిస్తోంది. అయితే అర్హుల ఎంపిక చేస్తారు. ఎన్ని కోట్లు ఖర్చు కానుందనే చర్చ మొదలైంది. అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకంపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది మొదట్లోనే ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇప్పుడు అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అర్హులను ఎలా ఎంపిక చేస్తారు. అర్హులు ఎవరు.. ఎంతమందికి ఈ నిధులు అందజేస్తారనే వివరాలు సభలో ప్రకటించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. తెలంగాణలో భూమి లేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టలేదు. పదేళ్లుగా చాలా రకాల సర్వేలు ప్రకటించినప్పటికీ ఈ భూమి లేని నిరుపేదల విషయంలో ఎలాంటి లెక్కలు లేవని తెలుస్తోంది. ఈ మధ్య ప్రభుత్వం చేపట్టిన సర్వేలు ఏవీ పూర్తిగా కొలిక్కి రాలేదు. వాటిని ఆధారంగా చేసుకునేందుకు కూడా వీలు లేదు. అందుకే రెవెన్యూ రికార్డులతోపాటు ఉపాధి హామీ పథకాన్ని ఆధారంగా చేసుకుంటుందా అనే అనుమానం ఉంది. ఉపాధి హామీ పథం ప్రకారం రాష్ట్రంలో 53 లక్షళ కుటుంబాల వారికి జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో చిన్న, సన్నకారు రైతులు కూడా ఉంటారు. అందులో వారిని ఎలా వేరు చేస్తారనేది సస్పెన్స్‌గా మారింది. ఈ లెక్కలతోపాటు రెవెన్యూ రికార్డులు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ లెక్కల ప్రకారం 40 లక్షల కుటుంబాలను భూమి లేని వారిగా ప్రభుత్వం గుర్తించిందని అంటున్నారు. ఈ లెక్కలు కాసేపు పక్కన పెడితే.. అసలు అర్హులను ఎలా గుర్తిస్తారు. భూమి లేని వారిని ఏ ప్రతిపాదికన ఎంపిక చేస్తారనే చర్చ కూడా ఉంది. ఎంతలా కుదించినప్పటికీ పాతిక నుంచి 30 లక్షల కుటుంబాలకు మాత్రం ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉంది. అంటే దాదాపు 15 నుంచి 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. సంవత్సరానికి అంటే మూడు నుంచి 3వేల ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టాలి. రుణమాఫీ, రైతు భరోసా మాదిరిగా కాకుండా ప్రతి నిరుపేదకు న్యాయం జరిగేలా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అనవసరమైన కొర్రీలు పెట్టి ప్రజలను మోసం చేయొద్దని సూచిస్తున్నారు. లేకుంటే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

# కూల్చివేత జాబితాలో గులాబీ కార్యాలయం

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? కీలక నేతలు ఎందుకు టెన్షన్ పడుతున్నారు? పార్టీ పగ్గాలపై వారసుల మధ్య అంతర్గత కలహాలు మొదలయ్యాయా? హైదరాబాద్ ఫ్లై ఓవర్ల నిర్మాణం నేపథ్యంలో చాలామంది నేతల ఇళ్లు పోతున్నాయా? జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన సర్వేలో బీఆర్ఎస్ ప్రధాన ఆఫీసు ఉందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సిటీలో ట్రాఫిక్ నియంత్రించాలంటే ఫ్లైఓవర్ల నిర్మాణం ఒక్కటే సాధ్యమని భావించింది. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు వేస్తోంది. ఫ్లైఓవర్లు ఎక్కడ నిర్మించాలనే దానిపై సర్వే మొదలుపెట్టేసింది జీహెచ్ఎంసీ. దానికి తగ్గట్టుగా మార్కింగ్ చేస్తూ పోతోంది. ఫ్లైఓవర్లకు సంబంధించి భూసేకరణకు నేపథ్యంలో దాదాపు 350 వరకు ఆస్తులు ప్రభావితమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు 90 నివాసాలకు మార్కింగ్ చేశారు అధికారులు. అందులో సినీ, రాజకీయ నేతల నివాసాలున్నాయి. అలా మార్కింగ్ చేసిన వాటిలో తొలుత టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ఇల్లు, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, అల్లు అర్జున్ మామ ఇలా కొందరి నేతల ఇళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన అరడజను నేతల ఇళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీ సర్వే ప్రకారం అధికారులు ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ చేస్తున్నారట. ఇళ్ల తొలగింపు జాబితాలో కొందరు కాంగ్రెస్ నేతలతోపాటు అరడజను మంది బీఆర్ఎస్‌కు చెందిన నేతలున్నారట. మాగ్జిమమ్ ఇళ్లు పోకుండా పార్కింగ్ ప్రాంతం తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారట అధికారులు. అప్పటికీ కుదరని భావిస్తున్న నేపథ్యంలో ఆయా నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు చేపట్టిన అంతర్గత సర్వేలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు సగం పోయే అవకాశముందని కొందరి అధికారులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతం డౌన్ ఉండడం ఒకటైతే, కొద్దిపాటి వర్షం పడితే నీరంతా అక్కడే ఉండిపోతుందని అంటున్నారు. దానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలంటే అక్కడ మరో బ్రిడ్జి నిర్మాణం చేస్తే బాగుంటుందని అంటున్నారు. మూసీ పునరుజ్జీవన విషయంలో ఎలాగైతే ప్రజలను రెచ్చగొట్టారో అలాగే చేయాలన్నది కారు పార్టీ నేతల ఆలోచన చెబుతున్నారు. ఈ విషయం తెలిసి కొందరు కారు పార్టీ నేతలు సైలెంట్ అయ్యారు. మొత్తానికి కూల్చివేతల వ్యవహారం రాజకీయంగా దుమారం రేగడం ఖాయమనే చిన్నపాటి చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో బలంగా సాగుతోంది.

# ఆదిలాబాద్ ఏజెన్సీలో మంచు దుప్పటి

అదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా మరో కాశ్మీరాన్ని తలపిస్తుంది. ఉత్తరాది చలిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో అత్యల్ప స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రతతో ప్రజలు రోజువారీ పనుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఎముకలు కొరికే చలికి తోడు ఏజెన్సీలో దట్టమైన మంచు దుప్పటి ఆవహించుకుంది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దట్టమైన మబ్బులతో వాతావరణం చీకటిమయం కాగా ఉట్నూర్, నార్నూర్, తిర్యాని, కెరమెరి, ఆసిఫాబాద్, జైనూర్ మండలాల్లో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పతనమవుతున్నాయి. మరో వారం రోజులపాటు ఆదిలాబాద్ జిల్లాతో పాటు కొమరంభీం జిల్లాలో ఇదే స్థాయిలో శీతల గాలులు వీస్తాయని చలి తీవ్రతతో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోతాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా అతి శీతల పవనాలతో మరో కాశ్మీరాన్ని తలపిస్తుంది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలులు, రాష్ట్రంలోనే అత్యల్ప స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి, తెల్లవారుజామున గడ్డ కట్టే చలిలో జనం అవస్థలు వర్ణనాతీతం.. చలి తీవ్రతతో ప్రజలు రోజువారీ పనుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చలిమంటలు సాధారణంగా కనిపిస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు చలికి ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. జిల్లా వాసులు ఈ పరిస్థితులను తట్టుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. మరోవైపు పొగమంచు కారణంగా రహదారులపై వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు, చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెట్టర్లు, చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలులతో పాటు రాష్ట్రంలోనే అత్యల్ప స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి ఉదయం వేళల్లో గడ్డ కట్టే చలిలో జనం అవస్థలు పడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా బేల మండల కేంద్రంలో 7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు కావడం చలి తీవ్రతకు అద్దం పడుతుంది. ఆదిలాబాద్ జిల్లా లోని 4మండలాలు, నిర్మల్ జిల్లాలోని 3 మండలాలు కొమరరంభీం జిల్లాలోని తొమ్మిది మండలాల్లో రికార్డు స్థాయిలో సింగిల్ డిజిట్లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ముఖ్యంగా రాత్రుళ్లు చలి ఇబ్బంది పెడుతుంది. శీతలగాలులు ఇదే విధంగా కొనసాగితే పిల్లలు, వృద్ధులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందంటున్నారు. ఏజెన్సీలో గిరిజనులు, ప్రతిరోజు పట్టణాల్లో కూరగాయలు పాలు అమ్ముకునే సాధారణ రైతులు, పారిశుద్ధ్య కార్మికులు, బస్టాండ్ రైల్వే స్టేషన్లో యాచకుల పరిస్థితి దెన్యంగా మారుతుంది. కశ్మీర్ తరహాలో చలిగాలుల నేపథ్యంలో పిల్లలు వృద్ధులు వణికిపోతున్నారని, అనారోగ్య సమస్యలు క వాడ తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దగ్గు, జలుబు, చలిజ్వరం శ్వాస సంబంధ వ్యాధులు ఈసమయంలోనే ప్రభావం చూపుతున్నాయని డాక్టర్లు పేర్కొంటున్నారు. చలి తీవ్రత నేపథ్యంలో అతి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు. దట్టంగా కమ్మేసే పొగ మంచు, అతి శీతల పవనాల నేపథ్యంలో వృద్ధులు పిల్లలు అతి జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరెంజ్ అలర్ట్.. శీతల గాలులకు తోడు కనిష్ట ఉష్ణోగ్రతలతో ఏజెన్సీ ప్రజలు అల్లాడిపోతున్నారు. మరో వారం రోజుల్లో 5 నుండి 3 డిగ్రీలకు పడిపోయే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ తేల్చి చెప్పింది. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 7 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోద యింది. నిర్మల్ జిల్లా పెంబి మండలంలో 8.3 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా తపాలాపూర్ లో 10.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది.

# రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ దిగజారుతున్నాయి

**- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద**

**- సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి**

సిటీ: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అని వ్యవస్థలూ దిగజారుతున్నాయని సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే లతో కలిసి ఆయన మాట్లాడారు. పోలీసులను అడ్డు పెట్టుకుని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. శాసనసభను కాంగ్రెస్ వారి అబద్ధాలు చెప్పుకునే వేదికగా మార్చారన్నారు. రూల్ బుక్ పాటించడం లేదని, ప్రభుత్వానికి దీనిపై చర్చ చేసే దమ్ములేదని విమర్శించారు. లగచర్ల రైతులకు మద్దతుగా మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, విద్యార్థుల దగ్గరకి, హైడ్రా బాధితుల దగ్గరికి కాంగ్రెస్ నాయకులు వెళ్లరన్నారు. లీకులు ఇచ్చి కేటీఆర్ గురించి మాట్లడించడం కాదని, రేవంత్‌కు దమ్ముంటే శాసనసభలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. స్పష్టంగా కేటీఆర్ వచ్చి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



దొంగ రాతలు రాయించడం బంద్ చేయాలన్నారు. బిల్లులు పాస్ చేయడానికి మాత్రమే శాసన సభ అన్నారు. 15 రోజులు శాసనసభ నిర్వహించాలంటే భయపడి వాయిదా వేసుకుని పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చకు సిద్ధమా..? తమ ప్రతి పనిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసెంబ్లీని పక్కదారి పట్టించినా.. ప్రజా క్షేత్రంలో తప్పించుకపోలేరన్నారు.

# ఎప్‌సెట్ కన్వీనర్‌గా బి డీన్‌కుమార్

**- ఐసెట్ కన్వీనర్‌గా అలువాల రవి**

**- త్వరలో ప్రవేశ పరీక్షల తేదీల ప్రకటన**

**- ఉన్నత విద్యామండలి వెల్లడి**



హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా, ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలను నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్లను ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్ల పేర్లను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలికిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ప్రకటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు మళ్లీ అప్పగించారు. ఎప్‌సెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ బి డీన్‌కుమార్‌ను నియమించారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు అప్పగించారు. పీజీఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ మెకానికల్ విభాగం ప్రొఫెసర్ ఎ అరుణ కుమారి నియమితులయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ నిర్వహణ బాధ్యతను మహాత్మాగాంధీ విశ్వవిద్యాలం (ఎంజీయూ)కు అప్పగించారు. ఐసెట్ కన్వీనర్‌గా బిజినెస్ విభాగం విభాగం ప్రొఫెసర్ అలువాల రవిని నియమించారు. పాలిటెక్నిక్ అభ్యర్థులు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల్లో చేరేందుకు నిర్వహించే ఈసెట్ నిర్వహణ బాధ్యతను ఓయూకు అప్పగించారు. ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొపెసర్ పి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నిర్వహణ బాధ్యతను మళ్లీ ఓయూకు అప్పగించారు. కన్వీనర్‌గా ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ బి విజయలక్ష్మిని నియమించారు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతను కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు అప్పగించారు. ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డిని నియమించారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ నిర్వహణ బాధ్యతను పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు అప్పగించారు. కొత్త కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ నియమితులయ్యారు. మేలో ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని ఉన్నత విద్యామండలి ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రవేశ పరీక్షల తేదీలను త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని వారు తెలిపారు.

# నల్లచట్టాల అమలును ఆపాలి

**- కనీస మద్దతు ధర కల్పనపై మోడీ సర్కారు మోసం**

**- 23న 500 జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను జయప్రదం చేయాలి**

**- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్**




హైదరాబాద్: రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే చట్టం తీసుకొస్తామని రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి దొడ్డిదారిన నల్లచట్టాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవ్వటం దుర్మార్గమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. నల్లచట్టాలను తీసుకురావడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఈ నెల 23న దేశంలో 500 జిల్లా కేంద్రాల్లో ఎస్కేఎం తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపు నిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లచట్టాల్లోని సారాంశం ఆధారంగా మార్కెట్ ఆధారిత చట్టం కొత్తగా రూపొందించి అమలు చేయాలని చూడటం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతుల పోరాటంపై ఉక్కుపాదం మోపుతూ అరెస్టులు చేయడా న్ని ఖండించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు రైతు సంఘాల నాయకులపైనా, రైతులపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి వేధించడాన్ని తప్పుబట్టారు. నోయిడాలో రైతుల నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు సంఘాల నేతలతో చర్చలు జరపాలనీ, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘాల జేపీసీ పిలుపు మేరకు 23న జరిగే ఆందోళనల్లో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం అంటే భారతదేశ ఆహార భద్రతను కాపాడటమేనని చెప్పారు. నేడు చాలా దేశాలు ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తీరును, కోవిడ్ కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం దేశంలో 5,400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ కార్మికులు 5,800 మందికిపైగా చనిపోయారని తెలిపారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయిస్తే.. కేంద్రంలోని ప్రస్తుత మోడీ సర్కారు 1.37 శాతానికి నిధులను కుదించిందని విమర్శించారు. ఆధార్ పేరుతో ఏడు కోట్ల జాబ్‌కార్డులను తొలగించిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డుల్లోని 5.86 కోట్ల మంది లబ్దిదారులను తొలగించిందనీ, 2 కోట్ల రేషన్‌కార్డులను రద్దు చేసిందని విమర్శించారు. ఈ చర్యలను తక్షణమే వెనక్కి తీసుకుని రైతాంగ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకపోతే మోడీ సర్కారు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ వచ్చాకే తాగునీటి సరఫరా జరిగిందా?

**- దానికి ముందే సరఫరా చేసిన కాంగ్రెస్ : మంత్రి సీతక్క**

హైదరాబాద్: ప్రజలు తెలంగాణ వచ్చాకే మంచినీళ్లు తాగినట్టు, మిషన్ భగీరథ వచ్చాకే తాగునీటి సరఫరా జరిగినట్టు బీఆర్ఎస్ సభ్యులు చెబుతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలిలో కొత్తగా నిర్మించిన ఇండ్లకు తాగునీటి నల్లా కనెక్షన్లపై తక్కెళ్లపల్లి రవీందర్ రావు వేసిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.460 కోట్లు నిర్వహణ బకాయిలు పెట్టారని తెలిపారు. అంతకు ముందు రవీందర్ రావు మాట్లాడుతూ 2021లోనే వంద శాతం ఇండ్లకు తాగునీటిని సరఫరా చేసిన చరిత్ర లిఖించదగిందని తెలిపారు. రూ.50 వేల కోట్లతో మిషన్ భగీరథ చేపట్టి మంచినీటి సరఫరా చేశామని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు జీవన్ రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ లాంటి సెంట్రలైజ్డ్ స్కీంతో ఇబ్బంది అని తెలిపారు. నీరు ప్రతి 20 నుంచి 30 కిలోమీటర్లు దాటితే ఫ్లోరిఫికేషన్ పోయి రా వాటర్‌గానే



అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి బదులిస్తూ, ఫ్లోరిఫికేషన్, ప్యూరిఫై కోసం తమ శాఖ సాంకేతిక అవకాశాలను పరిశీలిస్తున్నదని చెప్పారు. 1.28 లక్షల ఇండ్లకు కనెక్షన్లు, 2.4 లక్షల ఇండ్లకు సరఫరాను మెరుగుపరచగా, 0.95 లక్షల ఇండ్లు ఇంకా మిగిలి ఉన్నాయని తెలిపారు.

# అప్పుడే రిటైర్మెంట్..అంతలో వివాదం

## - అశ్విన్ ఇక్కడ ధోనీ ఫ్యాన్స్..!!



భారత్ ఆస్ట్రేలియా మధ్య బ్రిస్బేన్‌లో జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. భారత అభిమానులు హమ్మయ్యా అనుకునే లోపే టీమిండియా క్రికెటర్ స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ తాను అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. దీంతో ఒక్కసారిగా అతని అభిమానులు షాక్‌కు గురయ్యారు. అదే సమయంలో ఎక్స్ (ట్విటర్) వేదికగా ఇండియన్ క్రికెట్‌కు అశ్విన్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. ఇదే జాబితాలో పలువురు ప్రముఖ క్రికెటర్లు కూడా ఉన్నారు. భారత్ ఆస్ట్రేలియా మధ్య గబ్బా వేదికగా జరిగిన మ్యాచ్ వర్షార్పణం అయినప్పటికీ.. అశ్విన్ రిటైర్‌మెంట్ ఇప్పుడు ప్రధాన చర్చగా నిలిచింది.

ఇండియా ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో ఇంకా రెండు టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే అశ్విన్ రిటైర్‌మెంట్ ప్రకటన ఒక్కింత షాక్‌కు గురిచేయడమే కాదు.. ఇది సరైన సమయం కూడా కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఏది ఏమైనప్పటికీ తన ప్రకటనతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు. ఇక రిటైర్మెంట్ సమయంలో అశ్విన్ మాట్లాడుతూ తన సహచరుల గురించి ప్రస్తావించారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు పలువురు టీమిండియా ప్లేయర్ల గురించి మాట్లాడాడు. అయితే టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరును ప్రస్తావించకపోవడాన్ని ధోనీ అభిమానులు తప్పుబడుతున్నారు.

తన ప్రయాణంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, చటేశ్వర్ పుజారా, అజింక్యా రహానేలు చాలా కీలకంగా వ్యవహరించారని వారికి ధన్యవాదాలు తెలిపాడు అశ్విన్ . తన బౌలింగ్‌లో వీరంతా వికెట్ల వెనకాల ఉండి అద్భుతమైన క్యాచ్‌లు పట్టి తన కెరీర్‌లో సాధించిన వికెట్లలో కీలకంగా వ్యవహరించారన్నాడు. టీమిండియా కోచ్‌లు,భారత్ తరపున ఆడేందుకు అవకాశం ఇచ్చిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ధోనీ పేరు అశ్విన్ కావాలనే ప్రస్తావించలేదా..?

అశ్విన్ టీమిండియాలోకి అరంగేట్రం చేసిన నాటికి కెప్టెన్‌గా ధోనీ ఉన్నాడు. అశ్విన్ ఆస్థాయికి చేరడంలో కచ్చితంగా ధోనీ ఇచ్చిన ప్రోత్సాహం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధోనీ నాయకత్వంలోనే అశ్విన్ జట్టులో ఉండగా టీమిండియా 2011 వరల్డ్ కప్ గెలిచింది. 2013లో ధోనీ నాయకత్వంలోనే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ కైవసం చేసుకుంది. అలాంటి వ్యక్తిని అశ్విన్ ఎలా మరిచాడన్న మాట వినిపిస్తోంది. అయితే ప్రెస్‌మీట్ సందర్భంగా తాను ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేనని అశ్విన్ స్పష్టత ఇచ్చాడు. అందుకే ధోనీ పేరును ప్రస్తావించడం మరిచి ఉంటాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉంటే.. అశ్విన్, ధోనీ మంచి స్నేహితులు. వారి మధ్య మంచి సంబంధాలున్నాయి. ఐపీఎల్ 2025లో ఇద్దరూ చెన్నై సూపర్ కింగ్స్‌కు కలిసి ఆడతారు. అయితే అశ్విన్ రిటైర్‌మెంట్ ప్రకటన సందర్భంగా మాట్లాడిన మాటల్లో ధోనీ పేరును ప్రస్తావించకపోవడాన్ని అభిమానులు తీసుకోలేకపోతున్నారు. అయితే తాను కావాల్సిగా ఆ తప్పు చేయలేదనేది స్పష్టమవుతోంది.

# రోహిత్ రిక్వెస్ట్‌తో వెనక్కి తగ్గిన అశ్విన్!



టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి షాక్‌కు గురి చేశాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు.

వర్షం కారణంగా ఈ మ్యాచ్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. అశ్విన్ ఆకస్మిక నిర్ణయంతో అభిమానులు, సహచర ఆటగాళ్లు, మాజీ క్రికెటర్లు షాకయ్యారు. సోషల్ మీడియా వేదికగా అతనికి అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తు మరింత బాగుండాలని ఆకాంక్షిస్తున్నారు.

వాస్తవానికి అశ్విన్.. పెర్త్ టెస్ట్ విజయానంతరమే రిటైర్మెంట్ ప్రకటించాలనుకున్నాడట. ఈ విషయాన్ని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'పెర్త్ టెస్ట్ విజయానంతరమే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించేందుకు సిద్దమయ్యారు. కానీ నేనే పింక్ బాల్ టెస్ట్ ఆడాలని రిక్వెస్ట్ చేశాను. నా అభ్యర్థనతో వెనక్కి తగ్గిన అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వాయిదా వేసుకొని ఈ రోజు వెల్లడించాడు.

అశ్విన్ నిర్ణయాన్ని మేం గౌరవిస్తున్నాం. అశ్విన్‌కు భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అతను గొప్ప మ్యాచ్ విన్నర్. అశ్విన్ చాలా సరదాగా ఉండే వ్యక్తి. మేం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అశ్విన్ వైపు చూసేవాళ్లం. అతను మమ్మల్ని గట్టెక్కించేవాడు. అతన్ని మేం ఎంతో మిస్సవుతాం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

2010 శ్రీలంక పర్యటనలో హరారే వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌తో చివరి మ్యాచ్ ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి అశ్విన్ 765 వికెట్లు తీసాడు.

టెస్ట్‌ల్లో 106 మ్యాచ్‌ల్లో 2.83 ఎకానమీతో 537 వికెట్లు పడగొట్టాడు. ఇందులో 5 వికెట్ల ఘనతను 37 సార్లు అందుకున్నాడు. 116 వన్డేల్లో 4.93 ఎకానమీతో 156 వికెట్లుత తీసాడు. 65 టీ20ల్లో 6.90 ఎకానమీతో 72 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 4, 400 పరుగులు చేశాడు. 106 టెస్ట్‌ల్లో 25.75 సగటుతో 3503 పరుగులు చేసిన్ అశ్విన్.. 6 సెంచరీలతో పాటు 14 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

## చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా..

# కపిల్ దేవ్ ఆల్‌టైమ్ రికార్డ్ బద్దలు!



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను బుమ్రా అధిగమించాడు.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1)లను ఔట్ చేయడం ద్వారా బుమ్రా ఈ ఘనతను అందుకున్నాడు. ఖవాజాను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన బుమ్రా.. మార్నస్ లబుషేన్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆసీస్ గడ్డపై కపిల్ దేవ్ 11 టెస్ట్‌ల్లో 51 వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా 10 టెస్ట్‌ల్లో 52 వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించాడు.

ఈ జాబితాలో బుమ్రా, కపిల్ దేవ్ తర్వాత అనిల్ కుంబ్లే(49), రవిచంద్రన్ అశ్విన్(40), బిషన్ సింగ్ బేడీ(35) ఉన్నారు. ఇరు జట్ల మధ్య జరిగిన టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన ఘనత మాత్రం ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయన్ పేరిట ఉంది. నాథన్ లయన్ 18 టెస్ట్‌ల్లో 63 వికెట్లు తీసాడు. అతనికి చేరువగా అశ్విన్ ఉన్నాడు.

ఇక గబ్బా టెస్ట్ అనేక మలుపులు తిరుగుతోంది. ఓవైపు వర్షం.. మరోవైపు భారత బౌలర్ల అసాధారణ ప్రదర్శన అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. టెయిలెండర్ల అసాధారణ బ్యాటింగ్‌తో ఫాలో ఆన్ గండం గట్టెక్కిన భారత్.. బౌలింగ్‌లో నిప్పులు చెరుగుతోంది. జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, సిరాజ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 33 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది.

ఆస్ట్రేలియా బ్యాటర్లలో నాథన్ మెక్‌స్వీనీ(4), ఉస్మాన్ ఖవాజా(8), మార్నస్ లబుషేన్(1), మిచెల్ మార్ష్(2), స్టీవ్ స్మిత్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. క్రీజులో ట్రావిస్ హెడ్(13 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(6 బ్యాటింగ్) ఉన్నారు. భారత బౌలర్లలో బుమ్రా, ఆకాశ్ దీప్ రెండేసి వికెట్లు తీయగా.. సిరాజ్ ఓ వికెట్ పడగొట్టాడు. ప్రస్తుతం ఆసీస్ ఆధిక్యం 229 పరుగులకు చేరింది. ఈ ఆధిక్యాన్ని 270లోపు కట్టడి చేసి ఆసీస్‌ను ఆలౌట్ చేస్తే టీమిండియా గెలుపు కోసం పోరాడవచ్చు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది.

# గబ్బాలో గట్టెక్కిన భారత్.. మరి WTC ఫైనల్ ఛాన్స్ పరిస్థితేంటి?

ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య మూడో టెస్టు డ్రాగా ముగిసింది. ఇప్పుడు ఈ ఫలితం రావడంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు ఎలా ఉంటాయనేది చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా (58.89 శాతం), భారత్ (55.88 శాతం)తో ఉన్నాయి. దక్షిణాఫ్రికా (63.33 శాతం) అగ్రస్థానంలో కొనసాగుతోంది. గబ్బా టెస్టులో మ్యాచ్ ఫాలోఆన్‌లో పడి డ్రాగా ముగిసిఉంటే భారత్ పరిస్థితి ఇంకాస్త క్లిష్టంగా మారేది. పర్సంటేజీ ఇంకా పడిపోయేది.

# ఇక మిగిలింది కోహ్లీ ఒక్కడే..!



టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆకస్మాత్తుగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి అందర్నీ షాక్‌కు గురి చేశాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ అనంతరం అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు.

వర్షం కారణంగా ఈ మ్యాచ్ డ్రాగా ముగియగా.. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న అశ్విన్.. తన 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. 'నా గురించి చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు. అంతర్జాతీయ క్రికెటర్‌గా నాకు ఇదే చివరి రోజు. ఆటగాడిగా నేను ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించాను. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సీనియర్ ఆటగాళ్లలో మాదే(రోహిత్‌తో) చివరి గ్రూప్. నేను చాలా మందికి కృతజ్ఞతలు చెప్పాలి. బీసీసీఐతో పాటు నా సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు స్పెషల్ థ్యాంక్స్. భారత అంతర్జాతీయ క్రికెటర్‌గా ఇదే నా చివరి రోజు. నేను క్లబ్ క్రికెట్ ఆడుతాను. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో నేను చాలా సరదాగా ఉండేవాడిని. భారత్ తరఫున ఆడినందుకు గర్వంగా భావిస్తున్నా. రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయం అనుకుంటున్నా. భారత క్రికెట్‌లో నా భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉంది. నా బౌలింగ్‌లో ఎక్కువ క్యాచ్‌లు పట్టిన పుజారా, రహానే, కోహ్లీ, రోహిత్ శర్మలకు స్పెషల్ థ్యాంక్స్ 'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

అశ్విన్ రిటైర్మెంట్‌తో వన్డే ప్రపంచకప్ 2021 గెలిచిన ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ ఒక్కడే మిగిలాడు. మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులోని ఆటగాళ్లలో అందరూ ఇప్పటికే భారత జట్టుకు దూరమయ్యారు. ప్రస్తుతం కోహ్లీ ఒక్కడే మిగిలిపోయాడు. అతను కూడా రిటైర్మెంట్‌కు చేరువలోనే ఉన్నాడు.

ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ అతి త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. ప్రస్తుతం 36 ఏళ్లే ఉన్న కోహ్లీ మరో నాలుగేళ్ల పాటు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉంది.

# వర్షం మా కొంపముంచింది: ప్యాట్ కమిన్స్



వర్షం కారణంగా సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్ చేజారిందని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్ట్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు వర్షం అంతరాయం కలిగించడంతో ఈ మ్యాచ్ ఫలితం తేలలేదు.

చివరి రోజు ఆట అనంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన ప్యాట్ కమిన్స్.. వర్షం చికాకు పెట్టిందన్నాడు. పూర్తి ఆధిపత్యం చెలాయించిన ఈ మ్యాచ్‌లో వర్షం కారణంగా విజయాన్ని అందుకోలేకపోయామని చెప్పాడు.

'మేం ఎన్నిసార్లు మైదానంలోకి వచ్చి డ్రెస్సింగ్ రూమ్‌లోకి పరుగెత్తామో కూడా నాకు గుర్తు లేదు. సాధారణంగా బ్రిస్బేన్‌లో వర్షం ఇలానే కాసేపు కురిసి ఆగిపోతుంది. ఇలా వర్షం అంతరాయం కలిగించడం చికాకు పెట్టింది. మరి ముఖ్యంగా ఈ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించిన తర్వాత విజయం దక్కకపోవడం అసంతృప్తికి గురి చేసింది.

వాతావరణాన్ని అంచనా వేయడం చాలా కష్టం. కానీ మేం ఈ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించేందుకు ప్రయత్నించాం. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తామనుకున్నా. 10 వికెట్లు చేతుల్లో ఉన్న టీమిండియా లక్ష్యచేధనకు ప్రయత్నిస్తుందనుకున్నా. 10 వికెట్లు తీసేందుకు కావాల్సిన ఓవర్లు కూడా ఉన్నాయి. కానీ వాతావరణం సహకరించలేదు. జట్టులోని ప్రతీ ఒక్కరు విజయం కోసం ప్రయత్నించడం గర్వంగా ఉంది. ప్రతీ ఒక్కరు మంచి ఉద్దేశంతో ఆడారు. రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లను కాపాడుకోవడం కంటే దూకుడుగా ఆడటమే ఉత్తమని భావించాం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.

రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ నిర్ణయం షాక్‌కు గురి చేసిందని ప్యాట్ కమిన్స్ తెలిపాడు. 'సిరీస్ మధ్యలో అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో షాకయ్యాను. అతను టీమిండియా ఛాంపియన్ ప్లేయర్. గత 10 ఏళ్లకుపైగా టీమిండియా తరఫున అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. అతనికి అద్భుతమైన కెరీర్ ఉంది.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం టీమిండియా 260 పరుగులకు ఆలౌటైంది. 185 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ 89/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. దాంతో భారత్ ముందు 275 పరుగుల లక్ష్యం నమోదైంది. ఈ లక్ష్యచేధనకు టీమిండియా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. వర్షం అంతరాయం కలిగించింది. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి భారత్ 8/0తో నిలిచింది. వర్షం తీవ్రత పెరగడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు.

# నీతో ప్రతిక్షణం ఆస్వాదించా.. విరాట్ కోహ్లీ ఎమోషనల్ ట్వీట్..!



వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అశ్విన్ రిటైర్మెంట్ పై పలువురు మాజీ క్రికెటర్లు, బీసీసీఐ స్పందించింది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అశ్విన్ రిటైర్మెంట్ పై ట్వీట్ చేశాడు." అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఆర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్టుల్లో త్వరగా 250, 300, 350, 400, 450 వికెట్లు పడగొట్టారని చెప్పారు. టెస్ట్ క్రికెట్‌లో 37 సార్లు ఐదు వికెట్లు తీసిన వారిలో ముత్తయ్య మురళీధరన్, షేన్ వార్న్ తర్వాత అశ్విన్ ఉన్నాడు" అని సచిన్ పేర్కొన్నాడు. భారత ప్రధాన కోచ్ గంభీర్ కూడా స్పందించారు. "మీరు ఒక యువ బౌలర్ నుంబీ%ఖీ% ఆధునిక క్రికెట్‌లో లెజెండ్‌గా ఎదగడం గొప్ప విషయం. నిన్ను మిస్ అవుతారు సోదరా! " అని చెప్పాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా ట్వీట్ చేసింది. "భారతీయ అభిమానులందరి నుంచి చాలా కౌగిలింతలు వచ్చాయి. యాష్ అన్నా!" అని విరాట్ కోహ్లీ, అశ్విన్ కలిసి ఉన్న వీడియోను ట్వీట్ చేసింది. బీసీసీఐ కూడా ట్వీట్ చేసింది. " ధన్యవాదాలు అశ్విన్. మీ ఆట గొప్పగా ఉంటుంది.

టీమిండియా అమూల్యమైన ఆల్ రౌండర్ మీరు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు" ట్వీట్ చేసింది. విరాట్ కోహ్లీ కూడా ట్వీట్ చేశాడు. " నేను మీతో 14 సంవత్సరాలు ఆడాను. ఈ రోజు మీరు రిటైర్ అవుతున్నారని మీరు నాకు చెప్పినప్పుడు అది నన్ను కొంత భావోద్వేగానికి గురి చేసింది. నేను మీతో ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. భారత క్రికెట్‌కు మీ సేవ మరువలేనిది. మీరు ఎప్పటికీ, ఎల్లప్పుడూ భారతీయ క్రికెట్ లెజెండ్‌గా గుర్తుండిపోతారు. మీ కుటుంబంతో పాటు మీ జీవితంలో ఉత్తమంగా గడపాలని కోరుకుంటున్న" అని ట్వీట్ చేశాడు.

## మీడియం పేసర్ నుంచి స్పిన్నర్‌గా..

# క్రికెట్ మాస్టర్‌మైండ్ అశ్విన్ ప్రస్థానం..!

దాదాపు పాతికేళ్ల క్రితం చెన్నైలోని సెయింట్ బేడేస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్‌కు చెందిన ఓ కుర్రాడు నెట్స్‌లో మీడియం పేస్ బౌలింగ్ చేస్తూ అలసిపోయాడు.. కొద్దిసేపు ఆఫ్-స్పిన్ ట్రై చేస్తానని కోచ్ విజయ్ కుమార్‌ను అడిగాడు. దీనికి ఆయన ఓకే అనడంతో.. బౌలింగ్ చేశాడు. బంతిపై అతడి నియంత్రణ చూసి కోచ్ ఆశ్చర్యపోయాడు. ఆ కుర్రాడిలో ఏదో ప్రత్యేకత ఉందని గుర్తించాడు. మర్నాడు ఎప్పటిలానే నెట్స్‌కు వచ్చి మీడియం పేస్ బౌలింగ్ చేయబోయాడు. కానీ, కోచ్ మాత్రం అంగీకరించలేదు.. స్పిన్ వేయాలని ఆదేశించాడు. నిరాశపడిన ఆ కుర్రాడు అయిష్టంగానే బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత అతడి తండ్రితో కోచ్ చర్చించి.. ఆఫ్ స్పిన్‌లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాడు. ఆ ఘటనే భారత్‌కు ఓ అత్యుత్తమ స్పిన్ ఆల్‌రౌండర్‌ను అందించింది. ఆ దిగ్గజం పేరు రవిచంద్రన్ అశ్విన్ ! 500కు పైగా టెస్ట్ వికెట్లను కూల్చిన బౌలర్. చెప్పుకోవడానికి ఆఫ్ స్పిన్నర్ అయినా, జట్టుకు అవసరమైన సందర్భాల్లో బ్యాట్ ఝుళిపించగల సత్తా ఉన్నోడు ఈ టీమ్ ఇండియా 'అన్న'. అశ్విన్ మ్యాచ్‌లో పరిస్థితులను వేగంగా అర్థం చేసుకొని మార్పులు చేసుకోగల సమర్థుడు. తన ఎత్తును అదనపు బలంగా వాడుకొని.. స్పిన్‌లో అదనపు బౌన్స్‌ను రాబట్టడంలో దిట్ట. తమిళనాడు తరఫున అండర్-16 ఆడే సమయంలో అతడు విసిరిన బంతుల్లో అదనపు బౌన్స్ కారణంగా ప్రత్యర్థి బ్యాటర్లు బాగా ఇబ్బందిపడి ఎల్బీల రూపంలో వెనుదిరిగారని కోచ్ విజయ్ కుమార్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. అశ్విన్ టెస్ట్ కెరీర్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 537 వికెట్లు సాధించాడు. వీటిల్లో అత్యధికంగా క్యాచ్‌ల రూపంలో 248.. ఎల్బీల రూపంలో 116 లభించాయి.

లెఫ్ట్ హ్యాండర్లకు సింహస్వప్నం..

14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అశ్విన్ చాలా రికార్డులు దాసోహం చేసుకొన్నాడు. ముఖ్యంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు అతడిని ఎదుర్కోవడానికి భయపడేవారు. టెస్ట్‌ల్లో ఏ బౌలర్ చేయలేని విధంగా 268 సార్లు లెఫ్ట్ హ్యాండర్ల వికెట్లను పడగొట్టడం ఓ రికార్డ్.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**